
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి

జిల్లా వార్తలు

శుక్రవారం 21 ఫిబ్రవరి 2025

మరుగున పడుతున్న మాతృభాషా ప్రాభవం!


- ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు సహా సూచిక బోర్డుల దాకా తెలుగుకు దక్కని ప్రాధాన్యం
- ఒత్తిడి పెట్టని తెలుగు భాషా సంఘాలు

తెలుగు అకాడమీ ఎక్కడ..?

గత ప్రభుత్వ హయాంలో అమలు కాని హామీ

కూటమి ప్రభుత్వమైనా చర్యలు చేపట్టాలని తెలుగు భాషాభిమానుల విజ్ఞాపన

- 8లో



ఇరుగుపొరుగు రాష్ట్రాల్లో మాతృభాషకు జనం పట్టం కడుతున్నారు.అందుకు తగ్గట్టే ప్రభుత్వాలూ మద్దతుగా నిలుస్తున్నాయి.అయితే మనవద్దే మాతృభాషా ప్రాభవం మరుగున పడిపోతోంది. కార్యాలయాలు మొదలుకుని వ్యాపార సముదాయాలు, వాహనాల బోర్డుల్లో సైతం తెలుగుకు ప్రాధాన్యత దక్కడం లేదు. అధికార భాషా చట్టం అమలుకు నోచుకోవడం లేదు.స్వచ్ఛందంగా తెలుగు వ్యాప్తికి, అభివృద్ధికి కృషి చేయాల్సిన తెలుగు భాషా సంఘాలూ ఈ విషయంలో ఉదాసీనంగా మారిపోవడం విచారకరం.

నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

నేటి నుంచి ముక్కంటీశ్వరాలయంలో


శివరాత్రి ఉత్సవాలు



భక్త కన్నప్ప

భక్తకన్నప్ప ధ్వజారోహణంతో ప్రారంభం

అంగరంగ వైభవంగా ఏర్పాట్లు



భక్తకన్నప్ప ధ్వజస్తంభానికి ముస్తాబు



విద్యుత్ కాంతులతో ముక్కంటి ఆలయం



ఆలయంలో పూల అలంకరణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహా శివరాత్రి ఉత్సవాలు శుక్రవారం భక్తకన్నప్ప ధ్వజారోహణంతో ప్రారంభంకానున్నాయి. పరమశివుడి వరంతో కన్నప్పగా మారిన తిన్నడికి కొండపై స్థానమిచ్చి, కిందిభాగంలో దేవదేవుడు కొలువైన పుణ్యక్షేత్రమిది. దీంతో భక్తుడు కన్నప్పకు తొలిపూజ చేసి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయడం ఆనవాయితీగా వస్తోంది. 14 రోజులు జరిగే శివరాత్రి ఉత్సవాల్లో ప్రథమంగా కన్నప్ప ధ్వజారోహణం జరగనుంది. ఇందులో భాగంగా శుక్రవారం ఆలయ అలంకార మండపం నుంచి భక్తకన్నప్ప ఉత్సవమూర్తిని కొండపైకి ఊరేగింపుగా తీసుకువెళ్తారు. అక్కడ వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి, శాస్త్రోక్తంగా కన్నప్ప ధ్వజారోహణం మహాక్రతువును నిర్వహించి దేవతలకు ఆహ్వానం పలుకుతారు. ఈ క్రమంలో కొండ, చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యుత్ దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంటోంది.

ఆకట్టుకుంటున్న అలంకరణలు

భవుడి మహా శివరాత్రి ఉత్సవాలకు శ్రీకాళహస్తి సర్వాంగసుందరంగా ముస్తాబైంది. ప్రధాన ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, రంగ వల్లులతో అలంకరించారు. గోపురాలకు కొత్త రంగులద్దడంతో. కళకళలాడుతున్నాయి. భక్తకన్నప్ప, రామసేతు వంతెన, పట్టణవ్యాప్తంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో చలువపందిళ్లు ఏర్పాటు చేశారు. చతుర్మాడ వీధులు, సాంస్కృతిక కార్యక్రమాల వేదికైన ధూర్జటి కళా ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. సన్నిధి వీధిలో కైలాసం సెట్టింగ్ పనులు జోరుగా సాగుతున్నాయి. రథాలు, నారద పుష్కరిణిలోని తెప్పలను రంగులతో ముస్తాబు చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈవో బాపిరెడ్డి చేతులమీదుగా వీటిని ప్రారంభించనున్నారు.



ధూర్జటి కళా ప్రాంగణం

ఉత్సవాల్లో నేడు...

- తెల్లవారుజామున 4:30 గంటలకు మంగళ వాయిద్యాలు
- ఉదయం 5గంటలకు గోపూజ, సుప్రభాతం, సర్వదర్శనం
- 6 గంటలకు ప్రథమ కాలాభిషేకం
- 7 గంటలకు ద్వితీయ కాలాభిషేకం
- 8 గంటలకు పరివార దేవతలకు నైవేద్యం, నిత్యోత్సవం
- 10 గంటలకు ఉచ్చికాలాభిషేకం
- మధ్యాహ్నం 3 గంటలకు కన్నప్ప కొండకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల తరలింపు
- సాయంత్రం 4 గంటలకు భక్తకన్నప్ప ధ్వజారోహణం
- 5 గంటలకు ప్రదోష కాలాభిషేకం
- 6 గంటలకు భక్తకన్నప్ప గ్రామోత్సవం
- 7 గంటలకు భక్తకన్నప్ప ఆలయ ప్రవేశం, స్వామి అమ్మవార్లకు ధూపదీప, నైవేద్యం, మంత్రపుష్ప సమర్పణ
- రాత్రి 8 గంటలకు మత్స్యగ్రహణం, అంకురార్పణ, వాస్తు శాంతి
- రాత్రి 9 గంటలకు పళ్లియర పూజ, స్వామి దర్శనం ముగింపు

డిప్యూటీ మేయర్‌గా మునికృష్ణ ప్రమాణస్వీకారం

- సెనేట్ హాలుకు సైకిల్‌పై వచ్చిన ఆర్సీ



తిరుపతి, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్‌గా ఆర్సీ మునికృష్ణ ప్రమాణ స్వీకారం గురువారం అట్టహాసంగా జరిగింది. ఇటీవల జరిగిన డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా టీడీపీకి చెందిన 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ మౌర్య నేతృత్వంలో డిప్యూటీ మేయర్‌గా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. దీనికి ముందు కూటమి నాయకులతో కలిసి టౌన్‌క్లబ్ సర్కిల్లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. తెలుగు మహిళలు హారతులతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి జ్యోతిరావ్ పూలే విగ్రహం, ఎస్వీయూ ప్రధాన గేటు ఎదురుగా గల అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని నివాళులర్పించారు. అక్కడి నుంచి సైకిల్‌పై ఎస్వీయూ సెనేట్ హాలుకు చేరుకుని డిప్యూటీ మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. కార్పొరేటర్లను కలుపుకుని నగరాభివృద్ధికి శ్రమిస్తానని చెప్పారు. తనను అభ్యర్థిగా నియమించిన కూటమి నాయకత్వానికి, ఓట్లు వేసిన కార్పొరేటర్లకు, గెలుపునకు కృషిచేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆయనను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, నాయకులు బీఎల్ సంజయ్, జేబీ శ్రీనివాస్, ఊకా విజయకుమార్, శ్రీధర్ వర్మ, పుష్పావతి, దంపూరి భాస్కర్, ఊట్ల సురేంద్ర నాయుడు, మన్నెం శ్రీనివాసుల నాయుడు, చినబాబు, మహేష్ యాదవ్, పాటకం వెంకటేష్, కృష్ణ యాదవ్, సుబ్బు యాదవ్ పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.



మునికృష్ణతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న మేయర్ శిరీష, చిత్రంలో ఎమ్మెల్యే ఆరణి



సమావేశం జరుపుతున్న డిప్యూటీ స్పీకర్ ముద్ర నారాయణ

కౌన్సిల్ భేటీలో హైడ్రామా!

- అధికారులు అవమానించారన్న మేయర్ శిరీష
- క్షమాపణలు చెప్పిన కమిషనర్, అధికారులు
- సంతృప్తి చెందలేనంటూ శిరీష బాయ్‌కాట్
- డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ అధ్యక్షతన సాగిన కౌన్సిల్ సమావేశం

తిరుపతి, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి) : 'డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో ఓ భవనం కూల్చివేతకు వెళ్లిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ప్రవర్తించిన తీరు నన్ను బాధించింది. వారి మీద ఎలాంటి చర్యలు తీసుకుంటారో కమిషనర్ చెప్పాలి. ఆ తర్వాతే కౌన్సిల్ సమావేశం కొనసాగుతుంది' అంటూ మేయర్ డాక్టర్ శిరీష డిమాండ్ చేశారు.

'ఆ భవనం కార్పొరేటర్ శేఖర్ రెడ్డి పేరుతో లేదు. అది పూర్తిగా అక్రమ కట్టడం. నిబంధనల మేరకే అధికారులం అక్కడకు వెళ్లాం. విధుల్లో భాగంగా తగిన గౌరవ, మర్యాదలు ఇవ్వలేకపోయివుంటే క్షమాపణలు చెబుతున్నా' అని డీసీపీ మహాపాత్ర చెప్పారు. అయితే డీసీపీ క్షమాపణలకు తాను సంతృప్తి చెందలేదని, ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలని కమిషనర్‌ను మేయర్ అడిగారు. 'వాళ్ల తరఫున నేను కూడా క్షమాపణ చెబుతున్నా. వాళ్లకు మెమో ఇచ్చి చర్యలు తీసుకుంటాం.'

ఇంతలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జోక్యం చేసుకుని మేయర్‌కు తగిన గుర్తింపు ఇవ్వని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారని, సభను సజావుగా సాగేలా చూడాలని సూచించారు. తనకు సరైన వివరణ అందలేదని మేయర్ బాయ్‌కట్ చేసి సభనుంచి వెళ్లిపోయారు. సుమారు 10 మంది కార్పొరేటర్లు ఆమెవెంట వెళ్లిపోయారు. ఇలా గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో హైడ్రామా నడిచింది.



బయటకు వెళ్లిపోతున్న శిరీష

మేయర్‌పై మండిపాటు

నాలుగేళ్ల పాలనలో మేయర్‌కు తగిన గౌరవం ఇవ్వకుండా మౌనంగా కూర్చోబెట్టిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదని ఎమ్మెల్యేతోపాటు పలువురు కార్పొరేటర్లు మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆమెకు గౌరవంతో పాటు తగిన స్వేచ్ఛ ఇచ్చామన్నారు. మేయర్ స్థానంలో ఉండి అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడానికి వెళ్లడమే పెద్ద తప్పు అని, అయినప్పటికీ సభా ముఖంగా కమిషనర్‌తో పాటు డీసీపీ క్షమాపణలు చెప్పిన తర్వాత లేచివెళ్లిపోవడం సభ్యత కాదన్నారు.

- **మేయర్‌గా ముద్రనారాయణకు బాధ్యతలు**

అవుట్ సోర్సింగ్ సిబ్బందికి జీతభత్యాలు, పారిశుధ్యానికి సంబంధించిన కీలక అజెండా అంశాలపై చర్చించాల్సి ఉండడంతో కౌన్సిల్ సమావేశం జరగాలని కార్పొరేటర్లు పట్టుపడ్డారు. సభలో 15 మంది సభ్యులు ఉంటే కౌన్సిల్ జరుపుకోవచ్చన్న నిబంధన ఉండడంతో కమిషనర్ మౌర్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ అనుమతితో ఇద్దరు డిప్యూటీ మేయర్లలో సీనియర్‌గా ఉండే ముద్ర నారాయణకు సభ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్సీ మునికృష్ణ ప్రతిపాదించగా, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బలపరిచారు. దీంతో సభ సజావుగా సాగింది.

- **రూ.271 కోట్ల బడ్జెట్ అంచనాకు ఆమోదం**

తిరుపతి నగరపాలక సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ272కోట్లతో సిద్ధం చేసిన బడ్జెట్ అంచనాలకు సభ ఆమోదం తెలిపింది. రెవెన్యూ ఆదాయం రూ.170 కోట్లు, ఖర్చు రూ.116కోట్లు, మూలధన రాబడి రూ.92కోట్లు, ఖర్చు రూ.130 కోట్లకు అంచనా వేశారు. అనంతరం జరిగిన కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో 41 అంశాలపై చర్చ జరపగా ఒక ఉద్యోగికి ప్రమోషన్ ఇచ్చే అంశాన్ని మాత్రం పెండింగ్‌లో పెట్టారు. టేబుల్ అజెండాగా రెండు అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు.

ఎస్వీ వైద్య కళాశాలలో 9 మంది వైద్యుల తొలగింపు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి):కొవిడ్ సమయంలో విధుల్లో చేరి, ఆపై ఎలాంటి సమాచారం లేకుండా దీర్ఘకాలంగా విధులకు హాజరుకాని తొమ్మిదిమంది వైద్యులను ప్రభుత్వం తొలగించింది.వీరిలో తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలలోని పలు విభాగాలకు చెందిన వైద్యులున్నారు.తొలగించిన వారిలో ఆర్థోపెడిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎం.వెంకట్రావు, డాక్టర్ వి.సరస్వతి ,డాక్టర్ బి.కిరణ్‌కుమార్, డాక్టర్ కె.మధురిమనాయుడు, డాక్టర్ పి.నళిని (పీడియాట్రిక్), డాక్టర్ బి.చంద్రశేఖర్ (న్యూరాలజీ), డాక్టర్ కె.లావణ్య (జనరల్ మెడిసిన్), డాక్టర్ ఎ.కార్తిక్ (రేడియో డయాగ్నోసిస్), డాక్టర్ ఇ.శ్రీకాంత్ (కార్డియాలజీ) ఉన్నారు. వీరు దాదాపు ఏడాది కాలంగా విధులకు హాజరుకాకపోగా ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారమూ ఇవ్వనందుకు లోకాయుక్త ఆదేశాల మేరకు విధుల నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

గ్రూప్-2 మెయిన్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

తిరుపతి(కలెక్టరేట్),ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 23వ తేదీ నుంచి జరగనున్న గ్రూప్-2 మెయిన్స్ నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్‌లో గురువారం పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. పరీక్షలు నిర్వహించే 14కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.పేపర్-1 ఉదయం10 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, పేపర్-2మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రాల వద్దకు రవాణా సౌకర్యం కల్పించేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తొక్కిసలాటపై నేటి నుంచి రెండవ దశ విచారణ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో జనవరి 8వ తేదీన వైకుంఠ ద్వార దర్శన టిక్కెట్ల జారీలో జరిగిన తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణ మూర్తి నేతృత్వంలో ఏర్పాటు చేసిన విచారణ కమిటీ రెండో దశ విచారణ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. మొదటి దశలో భాగంగా ఈనెల 3వ తేదీ వరకు కమిటీ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి టీటీడీ ఈవో శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఇన్‌చార్జి సీవీఎస్వో మణికంఠ, రుయా, స్విమ్స్‌వైద్యుల నుంచి వివరాలు సేకరించడమేగాక తొక్కిసలాట జరిగిన బైరాగిపట్టెడ పద్మావతి పార్కును పరిశీలించారు. రెండవ దశలో పలువురిని విచారించి వాంగ్మూలం సేకరించనున్నారు. కలెక్టరేట్ వేదికగా ఈ విచారణ సాగనుంది. తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన ఆరుగురి కుటుంబ సభ్యులను, గాయపడిన 46మంది బాధితులను, పద్మావతి పార్కు పరిసరాల దుకాణాల వారిని ఇలా మొత్తం 70మందిని విచారించనున్నారు. వారికి ఇప్పటికే నోటీసులు ఇచ్చారు.


కల్తీ నెయ్యి కేసు నిందితులకు బెయిల్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

తిరుపతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసులో నిందితుల బెయిల్ పిటిషన్‌పై తిరుపతి 2వ ఏడీఎం కోర్టు న్యాయమూర్తి గురువారం తీర్పు రిజర్వు చేశారు. ఈనెల 10వ తేదీన రిమాండులో వున్న నలుగురు నిందితులకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వారి తరఫు న్యాయవాదులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. బెయిల్ పిటిషన్‌పై గురువారం కోర్టులో వాదనలు జరిగాయి.నిందితుల తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది వాణి వాదనలు వినిపించగా సిట్ తరఫున ఏపీపీ జయశేఖర్ వాదించారు. సుదీర్ఘంగా సాగిన వాదనలు విన్న న్యాయమూర్తి పిటిషన్‌పై తీర్పును రిజర్వు చేశారు.వచ్చే సోమవారం లేదా మంగళవారం తీర్పు వెలువరించే అవకాశముంది.

శ్రీవారి ఆలయ పైకప్పుకు మరమ్మతులు

- లీకేజీల నివారణకు మొదలైన పనులు
- ఉచిత సర్వీస్ కింద చేపట్టిన టీవీఎస్

తిరుమల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారి ఆలయంలో లీకేజీల నివారణ కోసం టీటీడీ పనులు మొదలుపెట్టింది. తిరుమల ఆలయంలో మూలమూర్తి కొలువైన గర్భాలయంతో పాటు పలు మండపాలు, ఉప ఆలయాలు ఉన్నాయి. వీటి నిర్మాణం జరిగి వందల ఏళ్లు కావడంతో ప్రస్తుతం మండపాలు, ఉప ఆలయాల పైకప్పులో చాలా ప్రాంతాల్లో పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో వర్షం కురిసినప్పుడు నీరు లోనికి ప్రవేశిస్తోంది.ఈ క్రమంలో గతేడాది నవంబరు 18వ తేదీన జరిగిన టీటీడీ బోర్డు సమావేశంలో ఈ సమస్యపై చర్చించి తీర్మానం చేశారు. లీకేజీల నివారణ అంశంలో అనుభవం కలిగిన టీవీఎస్ సంస్థతో ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఈ పనులన్నీ ఉచిత సర్వీస్ కింద చేసేందుకు ఆ సంస్థ అంగీకారం తెలిపింది. ఇందులో భాగంగా ఆ సంస్థకు చెందిన సిబ్బంది గురువారం లీకేజీ నివారణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పగుళ్లను గుర్తించి పూడ్చడంతో పాటు పెయింటింగ్ వేస్తున్నారు. మార్చి31వ తేదీన నాటికి మొత్తం లీకేజీలను నివారించేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు.



శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంపై మరమ్మతు పనుల్లో సిబ్బంది

నేడు అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల పోస్టుల భర్తీకి శుక్రవారం తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీడీపీవో ప్రదీప తెలిపారు. ఒక అంగన్‌వాడీ కార్యకర్త, ఒక మినీ అంగన్వాడీ కార్యకర్త, ఆరు హెల్పర్ల పోస్టులకు 20మంది దరఖాస్తు చేసుకున్నారని అందులో 17 చెల్లుబాటు అయ్యాయని వివరించారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ విద్యార్హత, కులం, ఆదాయ, నివాస ధృవపత్రాలతో హాజరు కావాలని తెలియజేశారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి : పులివర్తి సుధారెడ్డి



చిన్నగోర్పాడులో మాట్లాడుతున్న సుధారెడ్డి

పాకాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని సతీ మణి పులివర్తి సుధారెడ్డి కోరా రు. గురువారం మండలంలోని పెద్దరామాపురం, చిన్నగోర్పాడు, పెద్ద గోర్పాడు పంచాయతీలలో మహిళలతో ఆమె ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పద్మజారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బి.నాగరాజనాయుడు, కార్యదర్శి ఫల్గుణ, ఎంపీటీసీ రాజ్యలక్ష్మీ, తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు కె.సావిత్రి, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు చాముండేశ్వరి, మీనా, అరుణ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేయాలి



న్యాయవాది గురుస్వామినాయుడికి చావరాన్ అవార్డు అందజేస్తున్న చంద్ర హెచ్ రెడ్డి

పాకాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 317ఇ జిల్లా గవర్నర్ చంద్ర హెచ్ రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణంలో గురువారం లయన్స్‌క్లబ్ సేవా కార్య క్రమాలను ఆమె సమీక్షించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కెఎస్ తులసీ రామన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. క్లబ్ సభ్యులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. 15 సంవత్సరాల మైల్ స్టోన్ చావరాన్ అవార్డును పంపిణీ చేశారు. 30 వేల విత్తనాలు కళాశాలలో బాలికలకు అందజేశారు. విత్తనాలు నాటి సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్యాబినెట్ కార్యదర్శి సుధారెడ్డి, ట్రెజరర్ సౌమ్య, రీజినల్ చైర్‌పర్సన్ రామచంద్రారెడ్డి, చార్టెడ్ ప్రెసిడెంట్ జి.గురుస్వామినాయుడు, వైస్ ప్రెసిడెంట్ కుప్పుస్వామినాయుడు, డీసీలు కేఎస్ మస్తాన్, ఆర్వీ ప్రసాద్, జి.రామయ్య, ట్రెజరర్ జీవీ.ప్రసాద్, దొరస్వామి నాయుడు, యాసానుల్లా, రఘునాథనాయుడు, జగదీశ్వరి, నాగూర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటిలో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



మూషిక వాహనంపై దర్శనమిస్తున్న వినాయకుడు

చంద్రగిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తొండ వాడ స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరాలయంలో గురువారం నుంచి మహాశిరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ముక్కోటిలో మహాశివరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉత్సవాలలో భాగంగా గురువారం ఉదయం ఆలయంలో స్వామివారికి ప్రత్యేకాభిషేకం, ఆనందవల్లీదేవికి అభిషేకం చేసి విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం వినాయకస్వామి పూజ చేశారు. సాయంత్రం 6 గంటలకు మహా శివరాత్రి ఉత్సవాలకు అంకు రార్పణ చేశారు. రాత్రి 7 గంటలకు వినాయకస్వామి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి మూషిక వాహనంపై అదిష్టింపజేసి ఆలయ ప్రదక్షిణగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డుపై కంకర .. బోల్తాపడుతున్న వాహనాలు



రాయలచెరువు కట్ట మలుపు వద్ద రాలిన కంకర

రామచంద్రాపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి -పచ్చికాపల్లం ప్రధాన రహదారిపై వేగంగా వెళుతున్న టిప్పర్ల నుంచి కంకర జారి పడుతుండటంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతు న్నారు. పచ్చికాపల్లం నుంచి తిరుపతికి నిత్యం పదుల సంఖ్యలో కంకర టిప్పర్లు వెళుతుంటాయి. ఇవి వేగంగా వెళుతుండటంతో కంకర జారి రోడ్డుపై పడుతోంది. దీంతో వాహన చోదకులు అదుపు తప్పి బోల్తా పడి గాయాల పాలవుతున్నారు. రాయలచెరువు కట్ట ప్రమాదకర మలుపు వద్ద టన్నుల కొద్దీ కంకర జారి పడిఉండటంతో వాహనచోదకులు తరచూ అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. కంకర, గ్రావెల్ టిప్పర్లపై ఎలాంటి కట్టు లేకుండా వెళుతుండటంతో వాటివెనుక వెళ్లే వాహనచోదకులు కళ్లలో దుమ్ము పడి ఇబ్బందులు పడుతున్నారు. అధి కారులు స్పందించి రోడ్లపై కంకర జారిపడకుండా చర్యలు తీసుకోవాల్సి ఉందని ప్రయాణికులు కోరుతున్నారు.

ముగ్గురు దొంగల అరెస్ట్
రూ 3.76 లక్షల సొత్తు స్వాధీనం



నిందితులతోపాటు స్వాధీనం చేసుకున్న సొత్తును చూపుతున్న రైల్వే పోలీసులు

తిరుపతి(సెంట్రల్), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్లో ప్రయాణికుల నుంచి చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారినుంచి రూ3.76 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. రైల్వే భద్రతా దళాల ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, జీఆర్పీ సీఐ ఆశీర్వాదం సంయుక్తంగా తిరుపతి రైల్వే స్టేషన్‌లోని జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో గురువారం నిందితుల అరెస్ట్ చూపించారు. స్టేషన్‌లో పోలీసులను చూసి పారిపోతుండగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణ లో గతంలో చేసిన చోరీలకు సంబంధించి 85 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు మొబైల్ ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు.

సింహ, ముత్యపు పందిరి వాహనాలపై
కల్యాణ వెంకన్న చిద్విలాసం





ముత్యపు పందిరి వాహనంపై దేవేరులతో కలిసి విహరిస్తున్న కల్యాణ వెంకటేశ్వరుడు, సింహవాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారు

చంద్రగిరి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస మంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడోవ రోజు గురువారం స్వామివారు ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిర వాహనాలపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. తరువాత స్వామివారి ఉత్సవ మూర్తిని వాహన మండపానికి తీసుకొచ్చి యోగ నర సింహస్వామిగా అలంకరించి సింహ వాహనంపై అధిష్ఠింపజేసి తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు స్వామివారి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి సుగంధపరిమళ పుష్పాలతో అలంకరించిన ఊయలలో అధిష్టించి కన్నుల పండువగా ఊంజల్ సేవ జరిపించారు. రాత్రి స్వామివారి ఉత్సవమూర్తిని వాహన మండపానికి తీసుకొచ్చి బకాసురవధ అలంకరణ చేశారు. రాత్రి 7 గంటలకు ముత్యపుపందిర వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. వాహన సేవల ముందు వృషభ, అశ్వ, గజరాజులు ముందు ఠీవిగా నడుస్తుండగా మేళతాళాలు, మంగళవాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటాలు, కేరళ వాయిద్యాలు, గోవింద నామ స్మరణల నడుమ శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాలలో డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, కంకణ భట్టర్ నారాయణా చార్యులు, అర్చకులు బాలాజీ రంగా చార్యులు, పార్థసారథి, శేషాచార్యులు, సూపరింటెండెంట్లు రాజ్ కుమార్, రమేష్‌కుమార్,, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలలో నేడు...

బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగోవ రోజు శుక్రవారం ఉదయం 8 గంటలకు కల్పవృక్ష వాహనం, రాత్రి 7 గంటలకు సర్వభూపాల వాహ నంపై స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమివ్వనున్నారు. 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్న పన తిరుమంజనం, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు స్వామి అమ్మ వార్లకు ఊంజల్ సేవ నిర్వహించనున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా చండమేళం, కోలాటాలు

ఉదయం సింహ వాహన సేవలో చండ మేళం, కోలాటాల కళా ప్రదర్శనలు భక్తులను ఆకట్టు కున్నాయి. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఉడిపికి చెందిన అనిల్ బృందం చండమేళం (కేరళ డ్రమ్స్) వాంఎంం చారు. నల్గొండకు చెందిన కనకదుర్గ భజన బృందంలోని 25 మంది, తిరుపతికి చెందిన వల్లభ కోలాట భజన బృందంలోని 20 మంది చిన్నారులు, పాకాల, నారావారిపల్లె, కాకినాడకు చెందిన కళా బృందాలు కోలాటం నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.









సింహవాహన సేవలో కేరళ వాయిద్యాలు, కోలాటాలు వేస్తున్న కళాకారులు, నరసింహస్వామితో పాటు వివిధ దేవతామూర్తుల వేషధారణలో విద్యార్థులు, ఇతర దేవతా మూర్తుల వేషధారణలో కళాకారులు, చిన్నారులు

టీటీడీ బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్‌ను తొలగించాలి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): టీటీడీ పాలకమండలి సభ్యుడు నరేష్‌కుమార్‌ను తక్షణమే తొలగించాలని టౌన్‌బ్యాంకు వైస్‌చైర్మన్ వాసుయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుమల శ్రీవారి ఆలయం వద్ద టీటీడీ ఉద్యోగిని తిట్టిన బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి సురేష్, మురళి, అనిల్‌రెడ్డి, నరేష్, ఉమాపతి పాల్గొన్నారు.

పైడి అంకయ్యకు మలేషియా తెలుగు సంఘం ఆహ్వానం

తిరుపతిరూరల్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు పైడి అంకయ్యకు మలేషియా తెలుగుసంఘం (క్లాంగ్‌శాఖ) నుంచి ఆహ్వానం అందింది. ఈ నెల 23న మలేషియాలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో సంక్రాంతి సంబరాలలో ప్రదర్శన చేసేందుకు ఆహ్వానం పంపారని ఆయన పేర్కొన్నారు. 24మంది బృందంతో ప్రదర్శన ఇచ్చేందుకు ఈపర్యటనకు వెళ్తున్నామని వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

డిప్యూటీ మేయర్‌కు టీడీపీ నేతల అభినందనలు



తిరుపతి, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆర్సీ మునికృష్ణకు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, సీనియర్ నాయకులు మందలపు మోహన్‌రావు అభినందనలు తెలిపారు. నగరాభివృద్ధికి కృషిచేయాలని కోరారు.

వారాంతపు సెలవు మంజూరు చేయండి



సూపరింటెండెంట్ రవిప్రభుకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ల నేతలు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలోని పారామెడికల్ సిబ్బందికి వారాంతపు సెలవు మంజూరు చేయాలని సూపరింటెండెంట్ రవిప్రభును ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిబాబు కోరారు. ఏపీ జేఏసీ నేతలతో కలిసి ఆయన గురువారం సూపరింటెండెంట్‌ను కలిసి వినతి పత్రం అందించారు. సూపరింటెండెంట్ స్పందిస్తూ పాత పద్ధతిలోనే సెలవులు, వారాంతపు సెలవులు ఉంటాయని ఆ విధంగా ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు సురేష్, ప్రభాకర్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ముదురుతున్న బోర్డు సభ్యుడి వివాదం

- ఏకమవుతున్న టీటీడీ ఉద్యోగ సంఘాలు
- మౌనదీక్షకు సిద్ధమవుతున్న ఉద్యోగులు



టీటీడీ పరిపాలన భవనం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాలు

తిరుమల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో టీటీడీ ఉద్యోగిపై బోర్డు సభ్యుడు ప్రవర్తించిన తీరు వివాదం ముదురుతోంది. టీటీడీ ఉద్యోగ సంఘాలు నిరసనకు సిద్ధమవుతున్నాయి. శ్రీవారిని దర్శించుకుని వెలుపలకు వస్తున్న క్రమంలో మహాద్వారం గేటు తీయలేదనే కోపంతో టీటీడీ బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్ అక్కడి విధుల్లోని ఉద్యోగి బాలాజీ సింగ్‌పై తిట్ల దండకానికి దిగిన వైనం వివాదంగా మారింది. టీటీడీ ఉద్యోగి బాలాజీసింగ్‌కు మద్దతు తెలుపుతూ టీటీడీలోని ఉద్యోగ సంఘాలన్నీ ఏకమయ్యాయి. బోర్డు సభ్యుడిని వెంటనే తొలగించాలనే డిమాండ్ చేయడంతో పాటు రెండు రోజుల పాటు మౌనదీక్ష చేసేందుకు సిద్ధమవుతున్నాయి.

పరిపాలన భవనం ముందు నిరసన

బాలాజీకి మద్దతుగా తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ముందు టీటీడీ ఉద్యోగ సంఘాలు గురువారం నిరసన వ్యక్తం చేశాయి. ప్రధాన ద్వారం ముందు బైఠాయించి 'బోర్డు మెంబరు నరేష్ కుమార్ క్షమాపణ చెప్పాలి, టీటీడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి, టీటీడీ ఐక్యత వర్ధిలాలి, టీటీడీలో జరిపిన అత్యవసర సస్పెండ్‌లు, బదిలీలు రద్దు చేయాలి' వంటి ఫ్లెక్సీలతో నిరసన వ్యక్తం చేశారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఆర్వో రవి, వీఎస్వో రాంకుమార్ రెండు గంటల పాటు ఉద్యోగ సంఘ నాయకులతో చర్చించారు. కాగా, శుక్ర, శనివారాలు శాంతియుత పద్ధతిలో మౌనదీక్ష చేపట్టాలని ఉద్యోగ సంఘాలు నిర్ణయించాయి. అలాగే 24వ తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహించి, భవిష్యత్ కార్యాచరణ ప్రకటించాలని తీర్మానం చేసినట్టు టీటీడీ ఎంప్లాయిస్ బ్యాంక్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ వెల్లడించారు.

బోర్డు సభ్యుడి తీరు బాధాకరం: భానుప్రకాష్‌రెడ్డి

ఆలయ మహాద్వారం వద్ద ఉద్యోగితో బోర్డు సభ్యుడు ప్రవర్తించిన తీరు బాధాకరమని బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఆయన గురువారం టీటీడీ పరిపాలన భవనంలో ఉద్యోగ సంఘాలతో సమావేశమై చర్చించారు. టీటీడీ చైర్మన్ సమక్షంలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రుయాలో అత్యాధునిక ఐసీయూ పడకలు



తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రుయా ఆస్పత్రిలో 20 అత్యాధునిక ఐసీయూ పడకలు ఏర్పాటు చేశారు. రుయాస్పత్రిని ఇటీవల కలెక్టర్ వెంకటేశ్వర్ తనిఖీ చేశారు. ఆ సమయంలో అత్యవసర విభాగంతోపాటు కొన్ని ఐసీయూ వార్డులో పడకలు సక్రమంగా లేకపోవడాన్ని ఆయన గుర్తించారు. వెంటనే కొత్త పడకలను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు సూపరింటెండెంట్ రవిప్రభు ఆరోగ్యశ్రీ నిధుల్లో నుంచి రూ. 9 లక్షలతో 20 అత్యాధునిక ఐసీయూ పడకలను కొనుగోలు చేసి రోగులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటిని అత్యవసర విభాగంలో, ఐసీయూ వార్డుల్లో ఏర్పాటు చేశారు.

భారతీయ చరిత్రను తిరగరాయాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య రాణీసదాశివమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అనేక ప్రభావాల నుంచి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలతో కూడిన గొప్ప చరిత్రను తిరగరాయాల్సిన అవసరం ఉందని వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య రాణీసదాశివమూర్తి అన్నారు. 'కలియుగంలో భారత చరిత్రను తిరగరాయడానికి మొదటి వంద ముఖ్యమైన విషయాలు' అంశంపై రాసిన పుస్తకాన్ని గురువారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ క్రైస్తవ శకం నుంచి భారతదేశ చరిత్రను బయటకు తీసుకురావాలన్నారు. ఆర్యుల దండయాత్ర సిద్ధాంతాన్ని తిరస్కరించాలన్నారు. ఆర్య, ద్రావిడ విభజనను వ్యతిరేకించాలన్నారు. జంబూ ద్వీపం, భరత వర్షం, భరత ఖండ సరిహద్దులను మళ్లీ గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, చిగోరా ఆధ్యాత్మిక కేంద్రం స్థాపకులు హనుమంతరావు, పురోహితులు సురేష్, సుబ్రమణ్యంరెడ్డి, సాయి, పద్మనాభ నేషనల్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ స్థాపకులు పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది కిలోల గంజాయి స్వాధీనం

సత్యవేడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తిని సత్యవేడు పోలీసులు అదు పులోకి తీసుకుని అతడి నుంచి ఎనిమిది కిలోల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వా.ధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్ఐ రామ స్వామి వివరాలు తెలిపారు. గురువారం ఉదయం రాష్ట్ర సరిహద్దులోని మాదరపాకం చెక్ పోస్ట్‌వద్ద ఎస్ఐ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బ్యాగ్‌తో అనుమానస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులో తీసుకుని విచారించామ న్నారు. అతని బ్యాగ్‌లో రూ.80 వేల విలువైన ఎనిమిది కిలోల గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. కాగా పట్టుబడ్డ వ్యక్తి తమిళనాడు రాష్ట్రం మధురైకు చెందిన బాలమురుగన్ (43)గా గుర్తించామన్నారు. ఇతను విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలు చేసుకుని సత్యవేడు మీదుగా చెన్నైకు తీసుకెళ్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. కాగా పట్టుబడ్డ బాలమురుగన్‌పై విశాఖపట్నంలో కేసు కూడా నమోదైనట్లు తెలిసిందన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన శిక్ష

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20(ఆంధ్ర జ్యోతి): బాల్య వివాహాలకు పాల్పడిన వారికి శిక్ష తప్పదని ప్రగతి సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ రాజారెడ్డి అన్నారు. గురువారం తొట్టంబేడు మండలం పూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ... రానున్న శివరాత్రికి ముక్కంటీశుడి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని చాలా మంది వివాహాలు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే చైల్డ్ లైన్ టోల్‌ఫ్రీ నెం.1098కి సమాచారం ఇవ్వాలన్నారు. బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శైలజ, ఉపాధ్యాయులు, మహిళా పోలీసు రేణుగ, ప్రగతి సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

సీఎండీకి అభినందనలు



తిరుపతి(సెంట్రల్), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం కార్యాలయంలో గురువారం సీఎండీ కె.సంతోషరావును తిరుపతి సర్కిల్ అధికారులు శ్రీవారి మెమెంటోను అందజేసి అభినందనలు తెలిపారు. తిరుపతిలో ఏపీఈఆర్‌సీ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా తిరుపతి జిల్లా విద్యుత్ అధికారులు ఆయనను జ్ఞాపికతో అభినందనలు తెలిపారు. వారిలో ఎస్ఈ పి.సురేంద్రనాయుడు, ఈఈలు వి.చంద్రశేఖర్ రావు, పి.బాలాజీ, చిన్నరెడ్డెప్ప, వాసవీలత, డీఈఈఈలు భాస్కర్‌నాయుడు, ఆంజనేయులు, జయప్రకాష్ మునిప్రసాద్, ఏఈలు పాల్గొన్నారు.

సాంకేతికతతో సమాచార చేరవేతలో వేగం

సమాచార శాఖ ఏడీ రాజేందర్ చౌదరి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా సమాచారాన్ని చేరవేయడంలో వేగం పెరుగుతుందని సమాచార శాఖ ఏడీ రాజేందర్ చౌదరి పేర్కొన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ జర్నలిజం విభాగంలో జర్నలిజం-సాంకేతిక వినియోగంపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డిజిటల్, ఏవీ టెక్నాలజీని మీడియా రంగం మరింత విస్తృతంగా ఉపయోగించుకోవలసిన అవసరం ఉందన్నారు. దీని ద్వారా ప్రజలకు వేగంగా సమాచారాన్ని అందించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. డీన్ ప్రొఫెసర్ వాణి మాట్లాడుతూ.. మీడియా రంగం అమలులో ఉన్న చట్టాల గురించి కూడా అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లా సమాచార శాఖ అధికారి మాలకొండయ్య, ప్రొఫెసర్లు సీతాకుమారి, కిరణ్‌ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక లోడుతో ప్రమాదకర ప్రయాణం



గరుడ వారధిపై అధిక లోడుతో వెళుతున్న ఆటో

తిరుపతి(లీలామహల్), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆటోలు పరిమితికి మించి లోడు వేయరాదని రవాణా అధికారులు, పోలీసులు ఎన్ని ఆంక్షలు విధించినా... జరిమానాలు వేసినా... కొంతమంది పెడచెవిన పెడుతున్నారు. గురువారం కరకంబాడి రోడ్డు నుంచి కపిలతీర్థం వెళ్లే గరుడవారధిపై ఓఆటో అధిక లోడుతో వెళ్తున్న దృశ్యం ఇందుకు నిదర్శనంగా నిలిచింది. షేర్ ఆటో లోపల, పైన మిరపకాయ మూటలు వేసుకుని ప్రమాదకరంగా ప్రయాణం సాగించింది. నిబంధనల మేర ప్రయాణాలు క్షేమమని, ఇలాంటి సాహసాలు ఎందుకంటూ పలువురు వాహనదారులు మండిపడ్డారు.

ఆకలి... నాకూ అన్నం పెట్టండి ప్లీజ్..

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆకలిగా ఉంది.. నాకూ అన్నం పెట్టండి అంటూ ఓ గోమాత పాఠశాల ఆవరణలో విద్యార్థులతో పాటు నిలబడిన సంఘటన ఆశ్చర్యపరిచింది. మంగళం జిల్లా పరిషత్ ఉన్నత (ట్రెండ్స్) పాఠశాల విద్యార్థులకు ప్రతినిత్యం మధ్యాహ్నం ఇస్కాన్ నిర్వాహకులు భోజనం వితరణ చేస్తారు. మధ్యాహ్నం 12.30-1గంట మధ్య గోవులు పాఠశాలలోకి ప్రవేశించి పిల్లలు పడేసిన వ్యర్థాలు, ఎప్పుడు వేస్తారా అంటూ ఎదురుచూస్తుంటాయి. ఇందులో భాగంగానే గురువారం కూడా ఓ గోమాత ఆ సమయానికి భోజన వడ్డింపు స్థలానికి చేరుకుంది. చెత్తకుండీలో శోధించింది. ఆ తరువాత పిల్లలతో పాటు వచ్చి నిలబడి వడ్డిస్తున్న వారివైపు చూసింది. దీనిని గమనించిన పలువురు ఆశ్చర్యపోయారు. మరికొందరు పాఠశాలకు భద్రత, పర్యవేక్షణ కరువైందని ఆరోపించారు.



భోజన సమయానికి హాజరైన ఆవు

వృథా అన్నాన్ని ఆరగిస్తున్న ఆవు

చోరీలకు పాల్పడుతున్న మహిళ అరెస్టు

● రూ.12 లక్షల విలువచేసే బంగారు నగల స్వాధీనం



పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితురాలు, స్వాధీనం చేసుకున్న బంగారు నగలు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బస్టాండు, రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులనే లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న మహిళను అరెస్టు చేసి రూ.12 లక్షల విలువచేసే 180 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ డీఎస్పీ శ్యామ్ సుందరం తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అనంతపురంకు చెందిన సాకే స్వరూపారాణి(30) అలియాస్ వెంకటలక్ష్మీ, సంధ్య, సురభి దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులనే లక్ష్యంగా చేసుకొని గత కొంత కాలంగా చోరీలకు పాల్పడుతోంది. స్థానిక హరేకృష్ణ రోడ్డులో సదరు మహిళ అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంగా ఆమె ప్రయాణికుల నుంచి చోరీ చేసిన బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కేసులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు చిన్నపెద్దయ్య, శివకుమార్‌రెడ్డి, ప్రకాష్‌కుమార్, ఎస్‌ఐ సుభాన్ నాయక్, సిబ్బంది మురళి, మునిరాజులను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

మెకానిక్ కుటుంబాలకు అసోసియేషన్ భరోసా



మెకానిక్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఆవుల మునిరెడ్డి తదితరులు

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మెకానిక్‌ల కుటుంబాలకు అసోసియేషన్ అండగా ఉంటుందని టూవీలర్ మెకానిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక గాంధీభవన్‌లో అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులకు వృత్తిపరమైన గుర్తింపు కార్డులు, ప్రమాదబీమా సౌకర్యం వంటివి కూడా కల్పిస్తామన్నారు. త్వరలో ఈఎస్‌ఐ ఆస్పత్రి వైద్య సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం అనారోగ్యంతో మృతి చెందిన గాలివీధికి చెందిన మెకానిక్ రఫీ కుటుంబానికి రూ.20వేలు, మంగళంలో ఎలక్ట్రికల్ మెకానిక్‌గా పనిచేస్తూ అనారోగ్యం బారిన పడిన వేణుకు రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. సమావేశంలో లక్ష్మణరావు, కార్యదర్శి గురుఆచారి, కోశాధికారి బాబు, విక్కీ, కేశవ, నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

18వరోజుకు వెటర్నరీ విద్యార్థుల సమ్మె



తిరుపతి రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీవెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారమూ కొనసాగింది. వర్సిటీ ప్రధాన గేటు వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో విద్యార్థులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చేవరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మహిళా వర్సిటీలో మాతృభాషా దినోత్సవ సభ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ తెలుగు విభాగంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సభ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సావేరి సమావేశ మందిరంలో ఈకార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందులో డీన్ ఆచార్య వాణి, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రాంతీయాధికారి రాజేందర్ చౌదరి, క్షేత్ర ప్రచారాధికారి కందాళ రామమూర్తి పాల్గొంటారు. విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పోటీల్లో విజేతలకు బహుమతులు ఈ సందర్భంగా ప్రదానం చేయనున్నట్టు తెలుగు విభాగాధిపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి తెలిపారు.

అభినందన



వీసీ ఉమను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ నూతన వీసీ ప్రొఫెసర్ ఉమను తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ గురువారం అభినందించారు. వీసీ ఉమకు శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి ఆమె సత్కరించారు.

24న కిల్ గేమ్ షార్ట్‌ఫిల్మ్ విడుదల



మాట్లాడుతున్న నటి, నిర్మాత షీలా లోకనాథం

తిరుపతి(ఎంఆర్‌పల్లె), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కిల్‌గేమ్ షార్ట్‌ఫిల్మ్‌ను ఈ నెల 24న విడుదల చేయనున్నట్లు నటి, నిర్మాత షీలా లోకనాథం తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ట్రైలర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తమ షార్ట్‌ఫిల్మ్ క్రైమ్ థ్రిల్లర్‌ను తలపిస్తుందన్నారు. సుమారు 30 నిమిషాల నిడివి ఉంటుందని, ఈ నెల 24న యూట్యూబ్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపారు. దర్శకులు ఎస్‌కే దర్బార్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి పీజీ సెట్ రద్దు కోసం..

- ఎస్వీయూలో విద్యార్థి సంఘాల ఆందోళన



ఆందోళనలో పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీజీ ప్రవేశానికి చేపట్టిన ఉమ్మడి పీజీసెట్‌ను రద్దు చేయాలని వివిధ విద్యార్థి సంఘాలు డిమాండు చేశాయి. ఆయా యూనివర్సిటీలకే పీజీ అడ్మిషన్లు నిర్వహించుకునే అవకాశం కల్పించాలని కోరుతూ ఎస్వీయూలో గురువారం పలు విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐఎస్ఎఫ్ నేత బండి చలపతి, జిల్లా కార్యదర్శి ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ నేతలు అక్బర్, లా విద్యార్థి సంఘ నేత సుందరరాజు, పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి ఆశ, ఏపీ స్టూడెంట్ జేఏసీ నేత శ్రీధర్ తదితరులు మాట్లాడారు. ఉమ్మడి సెట్ వల్ల అన్ని యూనివర్సిటీల్లో పీజీ అడ్మిషన్లు దారుణంగా పడిపోయాయని తెలిపారు. దీని వల్ల గొప్ప చరిత్ర కల్గిన యూనివర్సిటీలు, విభాగాలు మూత పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉమ్మడి పీజీ సెట్‌ను రద్దు చేయకపోతే ఆందోళన తీవ్రం చేస్తామన్నారు. కార్యక్రమంలో పలు విద్యార్థి నేతలు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమిషనర్ గారూ...

తాగునీటి సమస్య పరిష్కరించరూ...!



దూరం నుంచి బిందెలతో తాగునీరు తీసుకొస్తున్న మహిళలు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కమిషనర్ గారూ... సాటి మహిళలం, తాగునీటి కోసం అవస్థలు పడుతున్నాం.. ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా పరిష్కారం లభించలేదంటూ శెట్టిపల్లి మహిళలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శెట్టిపల్లిలో గత రెండునెలల్లో పలుమార్లు పర్యటించిన నగర కమిషనర్ మౌర్య పాడైన వీధిబోరు చూసి పక్కనే ఉన్న అధికారులను హెచ్చరిస్తూ వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. అయినా సంబంధిత విభాగం పట్టించుకోలేదు. ఆరు నెలల క్రితం పాడైన వీధిబోరుకు మరమ్మతులు చేపట్టాలని స్థానిక మహిళలు ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదంటూ వాపోయారు. కమిషనర్ ఆదేశాలు కూడా గాల్లో మాటలేనని తేలిపోయిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. కనీసం ఎమ్మెల్యేగారైనా స్పందించాలని వారు కోరుతున్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



కలెక్టర్ నుంచి చెక్కు అందుకుంటున్న టీడీపీ నేత నరసింహయాదవ్, శశి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల క్రితం తిరుపతిలో జరిగిన అంతర్జాతీయ దేవాలయాల సమ్మేళనానికి విచ్చేసిన సందర్భంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం, టీడీపీనేత మనోహరాచారి లివర్ సంబంధిత వ్యాధితో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్ మనోహరాచారి వైద్యఖర్చుల నిమిత్తం రూ.6లక్షల సీఎం సహాయనిధి చెక్కును రాష్ట్ర యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ చైర్మన్ నరసింహయాదవ్‌కు అందజేశారు. అలాగే ఆర్‌సీపురం మండలం ఎస్‌ఆర్ కమ్మపల్లికి చెందిన శశి అనే మహిళ క్యాన్సర్ వ్యాధి బారిన పడి సర్జరీ చేయించుకున్నారు. ఆమెకు సైతం కలెక్టర్ వెంకటేశ్వర్ కలెక్టరేట్‌లో సీఎం సహాయనిధి నుంచి రూ.2లక్షలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మనోహరాచారి తరఫున చెక్కు అందుకున్న నరసింహయాదవ్, అలాగే శశి కుటుంబసభ్యులు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

యువతీ యువకుల మృతదేహాల అప్పగింత

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని రామానుజపల్లి చెక్‌పోస్టు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువతీ యువకుడి మృతదేహాలకు గురువారం రుయాస్పత్రిలోని మార్చురీలో పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ద్విచక్ర వాహనంపై వస్తున్న కడప జిల్లాకు చెందిన షాహీర్‌బాషా(21), అన్నమయ్య జిల్లాకు చెందిన యమున(20)లను బుధవారం రాంగ్‌రూట్‌లో వస్తున్న టిప్పర్ ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఘటనా స్థలంలోనే మృతిచెందిన యువతీ, యువకుడి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తీసుకువచ్చారు. దీంతో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఎంఆర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అంగన్వాడీ వర్కర్లకు శిక్షణ

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఫేజ్ -2 మంగళం పరిధిలోని అంగన్వాడీ వర్కర్లకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం గురువారం కూడా కొనసాగింది. వచ్చే జూన్ నుంచి నూతన విద్యావిధానం అమలవుతున్న నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఫౌండేషన్‌స్కూల్స్‌గా మారుస్తున్నారు. ఈ క్రమంలో మంగళం ప్రాథమిక ఉన్నత ట్రెండ్స్ పాఠశాలలో 60మంది అంగన్‌వాడీ వర్కర్లకు ఈ నెల 18న శిక్షణ ప్రారంభించారు. ప్రభుత్వ కాలనిర్ణయ పట్టిక ప్రకారం ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బడిపిల్లల అభివృద్ధి - వికాసం, భాషానైపుణ్యాలు, మేధాభివృద్ధి, శారీరకాభివృద్ధి, స్థూల, సూక్ష్మ అభివృద్ధి అనే అంశాలపై వర్కర్లకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ శిక్షణ తరగతులకు రీసోర్స్‌పర్సన్లుగా ప్రభుకుమార్, వినోద్‌కుమార్ వ్యవహరిస్తున్నారు.

ఆక్రమణల నుంచి మా భూములు కాపాడండి

● స్వాతంత్ర్య సమరయోధుల వారసుల గోడు



మాట్లాడుతున్న బాధితులు

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మండలం కొంకా చెన్నాయగుంటలో తమకు కేటాయించిన భూములను కొంతమంది ఆక్రమించుకున్నారని స్వాతంత్ర్య సమరయోధుల వారసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమించుకున్న భూములను తమకు ఇప్పించాలని విన్నవించుకున్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు మీడియాతో వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొంకా చెన్నాయగుంట సర్వే నెంబర్ 173/3లో 2.50 ఎకరాలను 1992లో అప్పటి ప్రభుత్వం ఒక్కొక్కరికి 0.04 సెంట్లు చొప్పున 40 మంది స్వాతంత్ర్య సమరయోధులకు కేటాయించింది. వారు గతించగా ప్రస్తుతం వారి వారసులకు హక్కుగా ఆ భూములు సంక్రమించాయి. ఈ భూములను 2021లో కొంతమంది తాత్కాలిక షెడ్లు వేసి ఆక్రమించారు. అప్పటినుంచి తమ భూముల సరిహద్దులు చూపించమని స్వాతంత్ర్య సమరయోధుల వారసులు కలెక్టర్ సహా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో గతేడాది డిసెంబరులో రెవెన్యూ సదస్సులో కూడా అర్జీలు సమర్పించారు. సర్వేకోసం చలానాలు కూడా కట్టారు. అయితే రెవెన్యూ అధికారులు పరిశీలించకుండానే, స్వాతంత్ర్య సమరయోధులకు సంబంధిత స్థలం ఇచ్చినట్లు తమవద్ద రికార్డుల్లేవని చేతులెత్తేశారు. కానీ సర్వే నెంబరు 173/3లో స్వాతంత్ర్య సమర యోధులకు సదరు 2.50 ఎకరాల భూమిని కేటాయించినట్లు అన్ని రికార్డులు వారివద్ద ఉన్నాయి. రెవెన్యూ అధికారులు ఆ భూమిని స్వాతంత్ర్య సమరయోధులకు కేటాయించినట్లు తమవద్ద రికార్డులు లేవని చెప్పడం అన్యాయమని వారసులు వాపోయారు. అంతేకాక సదరు భూములను ఇతరులకు విక్రయించుకోవడానికి కూడా 1995లో రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఎన్వోసీలు వారి వద్ద ఉన్నాయి. అలా కొన్న బాధితులు కూడా స్వాతంత్ర్య సమరయోధుల వారసులతో కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఆక్రమణ దారులనుంచి భూములను స్వాధీనం చేసుకుని తమకు ఇప్పించాలని వారు కోరారు. లేదంటే ఆందోళన చేయక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో స్వాతంత్ర్య సమరయోధుల వారసులు రమణయ్య, బాబురెడ్డి, శివప్రసాద్, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పొల్యూషన్ సర్టిఫికెట్ జారీలో జాగ్రత్తలు పాటించండి

- జిల్లా రవాణాశాఖ అధికారి మురళీమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న డీటీవో మురళీమోహన్


తిరుపతి(రవాణా), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్ జారీలో తనిఖీ కేంద్రాల యాజమాన్యం తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ అన్నారు. గురువారం జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో వాహన కాలుష్య తనిఖీ కేంద్రాల యజమానులతో సమావేశం నిర్వహించారు. డీటీవో మాట్లాడుతూ సర్టిఫికెట్ జారీ చేసే సమయంలో వాహన కండీషన్లను జారీ చేయాలని సూచించారు. ఇష్టానుసారంగా జారీ చేయడం ద్వారా పొల్యూషన్ పెరుగుతుందన్నారు. పరిమితికి మించి పొల్యూషన్ ఉన్న వాహనాలను తిరుమలకు అనుమతించేది లేదని, వాటిపై అపరాధ రుసుం కూడా విధిస్తామని హెచ్చరించారు. అన్ని రకాల వాహన కాలుష్య తనిఖీ కేంద్రాల క్రమాంకనం తప్పనిసరిగా చేయించుకోవాలని, పొల్యూషన్ టెస్టింగ్ సెంటర్ల వివరాలు, వాహన వివరాలను విధిగా వాహన పోర్టల్‌లో పొందుపరచాలని తెలియజేశారు. ఈ ప్రక్రియను మార్చి 10వ తేదీలోపు పూర్తి చేయాలని, లేనిపక్షంలో వాహన కాలుష్య తనిఖీ కేంద్రాల గుర్తింపును రద్దు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, కార్యాలయ ఏవో శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ చరణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐటీ ఆఫీసులో రక్తదాన శిబిరం

తిరుపతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆదాయపన్ను శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కేటీ రోడ్డులోని అయకార్ భవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు కార్యాలయ పీఆర్వో వెంకటబాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్వీఆర్ రుయా ఆస్పత్రి రక్తనిధి సహకారంతో జరగనున్న ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

రూ.65లక్షలతో మంగళం ట్రెండ్స్ పాఠశాలలో

ల్యాబ్‌గదుల నిర్మాణం



తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మంగళంలోని ప్రాథమిక ఉన్నత ట్రెండ్స్ పాఠశాలలో 6వ తరగతి నుంచి ప్లస్‌వన్, ప్లస్‌టూ విద్యార్థినీ విద్యార్థుల సౌకర్యార్థం సైన్స్ కెమిస్ట్రీ, కంప్యూటర్ ల్యాబ్ గదులు ఏర్పాటవుతున్నాయి. ప్రధానమంత్రి స్కూల్స్ రైజింగ్ ఇండియా పథకం కింద గత జనవరిలో రూ.65లక్షల నిధులు మంజూరయ్యాయి. పాఠశాల ఆవరణలో స్థలాభావం కారణంగా నాడు-నేడు కింద నిర్మాణం చేపట్టిన అదనపు తరగతుల భవనంపైనే రెండో అంతస్తులో ల్యాబ్ గదులు నిర్మించేందుకు అనుమతులు లభించాయి. దీంతో నిర్మాణ బాధ్యతలు చేపట్టిన కాంట్రాక్టర్ మెటీరియల్ నిల్వ చేసుకొని గత సోమవారం పనులు ప్రారంభించారు. మార్చిలో పూర్తి చేసేందుకు పనులు చురుగ్గా సాగుతున్నాయి.

24న అన్నా చెరువుకు చేపల వేలం

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన శెట్టిపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని అన్నాచెరువుకు ఈ నెల 24న చేపల టెండర్ల వేలం ప్రక్రియ జరగనుంది. ఈ మేరకు గురువారం సచివాలయ అధికారులకు విధివిధానాలతో ఆదేశాలు అందాయి. ఇప్పటి నుంచి జూన్ 30వరకే (పసలి కాలపరిమితి)టెండర్ టైమ్‌తో ఫిషరీస్ డెవలప్‌మెంట్ శాఖ అనుమతి ఇచ్చింది. ఈ మేరకు వచ్చే సోమవారం వేలం వేసేందుకు సచివాలయంలో నోటీసు బోర్డు పెట్టారు. కాగా స్థానిక శ్రీసత్యసాయి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ముందుకు రావడంతో మంచినీళ్లగుంటకు రూ.28వేలు, చింతమాకుల గుంటకు రూ.2.2లక్షలు చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు అడ్వాన్సు కూడా చెల్లించారు. అలాగే తిరుమలనగర్ పంచాయతీ పరిధిలో ఉన్న చెన్నాయగుంటచెరువుకు సైతం అనుమతి రావడంతో శ్రీసత్యసాయి మత్స్యపారిశ్రామిక సహకార సంఘానికి సమాచారమిచ్చారు. వారం గడువు విధించి ఆ తరువాత ఓపెన్ ఆక్షన్‌కు వెళతామని ప్రకటించారు.

గరుడ వారధిపై వన్‌వేలో రాకపోకలు



గరుడవారధిపై వన్‌వేలో ఎదురెళుతున్న ఆటో

తిరుపతి(లీలామహల్), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కరకంబాడి మార్గం నుంచి కపిలతీర్థంకు వెళ్లడానికి ఏర్పాటు చేసిన గరుడ వారధి (వన్‌వే)పై ఆటోలు ప్రమాదకరంగా ఎదురొస్తున్నాయి. కొందరు కపిలతీర్థం నుంచి నేరుగా వ్యతిరేక దిశలో అతివేగంగా వచ్చి వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గురువారం ఇలాంటి సంఘటన గరుడ వారధిపై కనిపించింది. కొందరు చేసే ఇలాంటి తప్పిదాల వల్ల జరిగే ప్రమాదం జీవితాలను తలకిందులు చేస్తాయని, సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిబంధనలు అతిక్రమించిన వారిని గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



జస్టిస్ ఇందిరా బెనర్జీ



జస్టిస్ భవానీప్రసాద్ - జస్టిస్ రమేష్ - రామసింగ్ - అజయ్ జైన్ - వీజే సన్నీ - సత్యశ్రీ

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఇందిరా బెనర్జీ, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ భవానీప్రసాద్, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీ రమేష్, ఏపీ ఈఆర్సీ చైర్మన్ టీ రామసింగ్, ఏపీ టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, సినీ నటులు వీజే సన్నీ, సత్యశ్రీ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

27న ఖాళీ డబ్బాల విక్రయానికి

సీల్డ్ టెండర్ల ఆహ్వానం

తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో నెయ్యి, నూనె, జీడిపప్పు ప్యాకింగ్‌కు వినియోగించిన ఖాళీ డబ్బాల విక్రయానికి టీటీడీ సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తోంది. టెండర్ పొందిన భక్తులు ఖాళీ డబ్బాలను 2026 మార్చి 31వ తేదీ వరకు సేకరించవచ్చు. తిరుపతి హరేరామ హరేకృష్ణ రోడ్డులో ఉన్న మార్కెటింగ్ (వేలం) కార్యాలయంలో సీల్డ్ టెండర్లు ఈనెల 27వ తేదీన మధ్యాహ్నం 3 గంటల్లోపు అందజేయాలి. ఇతర సమాచారం కోసం మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877 2264429ను సంప్రదించవచ్చు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీహరి సర్వదర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం : రూ.3.48 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 72,745

తలనీలాలు సమర్పించినవారు : 24,156



కామాక్షి సమేత పాండురంగేశ్వర స్వామి ఆలయం

పులికాట్ జనం ఆరాధ్యదైవం

పంట్రంగేశ్వరుడు

సముద్రతీరంలో, పులికాట్ సరస్సు అంచున వాకాడు మండలంలో ఉంది అత్యంత పురాతనమైన కామాక్షిదేవి సమేత పాండురంగేశ్వర స్వామి శివాలయం. పులికాట్ మీద ఆధారపడిన ప్రజల ఆరాధ్య దైవం పంట్రంగేశ్వరుడు. రెండు శివలింగాలున్న ఈ ఆలయం దాదాపుగా ఒక దీవిలో ఉంటుంది. పులికాట్ తీర గ్రామాలకు, దీవుల్లోని ప్రజలకు పంట్రంగేశ్వరుడు ఆరాధ్య దైవం. రాకపోకలకు సౌకర్యవంతమైన దారులు లేకపోవడంతో భక్తుల ఆదరణ తగ్గిపోయింది. అత్యంత పవిత్రమైన ఈ పురాతన ఆలయాన్ని సందర్శించడం మాత్రం గొప్ప అనుభవం.

- వాకాడు, ఆంధ్రజ్యోతి

చరిత్ర: చోళుల కాలంలో 11వ శతాబ్దంలో నిర్మించిన ఆలయంగా చారిత్రక ఆధారాలున్నాయి. తూర్పుచాళుక్యరాజు, గుణక విజయదస్తుని సేనాని పంట్రాంగుడు నిర్మించినట్లు శాసనాధారాలు తెలుపుతున్నాయి. సునామీతో కొన్ని వందల ఏళ్ల కిందట ఇసుక మేటలో అంతర్ధానం అయిపోయిన ఈ ఆలయాన్ని 1841లో పునరుద్ధరించినట్లు చెబుతారు. ఇంకా ముందు గొప్ప నౌకాకేంద్రంగానూ, వాణిజ్య పట్టణంగానూ పంట్రంగం ఉండేదని తెలుస్తోంది. శ్రీకృష్ణదేవరాయలు కూడా పంట్రంగం దగ్గరలో ఉన్న పూడిరాయదొరువు గ్రామంలోని దీవులలోకి వచ్చి విడిదిచేసి వెళ్తుండేవాడని అంటారు.

పురాణ ప్రాశస్త్యం: రెండు శివలింగాలున్న పంట్రంగం ఆలయంకు సంబంధించి ఒక ఐతిహ్యం ప్రచారంలో ఉంది. శ్రీరామచంద్రుడు రోజూ ఇక్కడికి పూజకు వచ్చే సమయానికి ఆంజనేయస్వామి ఆయన కోసం ఇసుకతో ఒక శివలింగాన్ని తయారు చేసి సిద్ధంగా ఉంచేవాడు. ఒకరోజు ఎందు చేతనో ఆంజనేయస్వామి ఆలస్యంగా ఈ దీవికి చేరుకున్నాడు. శ్రీరామచంద్రుడు తనే ఒక శివలింగాన్ని తయారు చేసి పూజ పూర్తి చేసేశాడు. రామ భక్తుడైన హనుమకు కోపం వచ్చింది.ఆ మాత్రం ఆగలేక పోయావా అని అలిగాడు. తన భక్తుడిని శాంతపరిచి, ఆంజనేయుడు చేసిన సైకత శివలింగాన్ని కూడా పక్కనే ప్రతిష్ఠించి శ్రీరాముడు పూజ చేశాడు. దీంతో రెండు శివలింగాలున్న ఆలయంగా పంట్రంగం ప్రసిద్ధి చెందింది. శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించిన శివలింగాన్ని పాండురంగేశ్వరస్వామి అని, శ్రీ ఆంజనేయస్వామి ఇసుకతో ప్రతిష్ఠించిన శివలింగాన్ని రామలింగేశ్వరస్వామిగా పిలుస్తారు.

విశేషాలు: ఒకే ఆలయంలో రెండు శివలింగాలు కలిగి ఉండటం పంట్రాంగం ప్రత్యేకత. ఆలయం ప్రాంగణంలో వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, మరో వైపు కామాక్షిదేవి, భైరవుడి ఆలయాలు ఉంటాయి. పరిసర ప్రాంతాలలో 101 శివలింగాలు, 101 కొలనులు దర్శనమిస్తాయి. దూపదీప నైవేద్యాల కొరకు పలువురు దాతలు 890 ఎకరాల భూమి పంట్రాంగం ఆలయానికి ఇచ్చినట్లు ఆధారాలున్నాయి. సాధారణ రోజుల్లో ఒకటీ అరా మాత్రమే భక్తులు సందర్శిస్తారు. శివరాత్రికి మాత్రం పోటెత్తి వస్తారు. సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, గూడూరు, నెల్లూరు పట్టణాల నుంచే కాక, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచీ కూడా భక్తులు వస్తారు.

శివరాత్రి ప్రత్యేకం: ఈ నెల 26 బుధవారం మహాశివరాత్రి మహోత్సవాలకు ఆలయం సిద్ధం అవుతోంది. కమిటీ నిర్వాహకుడు టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించేందుకు ఆలయాన్ని సిద్ధం చేస్తున్నారు.ఉదయాన్నే గణపతిపూజలో ప్రారంభమై మహాన్యాశ రుద్రాభిషేకం జరుగుతుంది. సాయంత్రం 6 గంటల నుంచి ప్రతి రెండు గంటలకోసారి పాలాభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 12 గంటలకు లింగద్భోవ పాలాభిషేకం, నైవేద్యం, విశిష్ఠ అలంకరణ జరుగుతాయి.తెల్లవారుజామున 2 గంటలకు కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. 4 గంటలకు వినాయకుడు, కామాక్షి అమ్మవారు, శివ పార్వతుల ఊరేగింపు ఉంటుంది.



శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించిన పాండురంగేశ్వరస్వామి



ఆంజనేయస్వామి ఇసుకతో ప్రతిష్ఠించిన రామలింగేశ్వరస్వామి



ఆలయ గోడలపై కనుమరుగవుతున్న పురాతన శాసనాలు

ఇలా వెళ్లాలి...

- నాయుడుపేట నుంచి మల్లాం మీదుగా 48 కిలోమీటర్లు దూరం ఉంటుంది. మల్లాం తరువాత రోడ్డు గుంతలమయంగా ఉంటుంది.
- గూడూరు నుంచి కోట మీదుగా మల్లాం చేరుకుని పంట్రంగంకి వెళ్లచ్చు. ఇది కూడా 48 కిలోమీటర్లు దూరం ఉంటుంది.
- పులికాట్ సరస్సులోంచి నడచి వెళ్లే దారి ఒకటుంది. సూళ్లూరుపేట నుంచి 25 కిలోమీటర్లు ప్రయాణిస్తే పేర్నాడుకి చేరుకోవచ్చు. అక్కడి నుంచి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో తోటకట్ల గ్రామం ఉంటుంది. అటకానితిప్ప ఇక్కడి దాకా మట్టి రోడ్డు మాత్రమే ఉంటుంది. జీపులు, బైకులు వెళ్తాయి. తోటకట్ల నుంచి పులికాట్ సరస్సులో దిగి 4 కిలోమీటర్లు నడిస్తే పంట్రంగం చేరుకోవచ్చు. వలస పక్షులను చూస్తూ ఈ దారిలో ప్రయాణించవచ్చు. ప్రస్తుతం పులికాట్‌లో నీళ్లు లేవు. బైకులు, ట్రాక్టర్లు వెళ్తాయి. సముద్రం పోటెక్కితే నీళ్లు వస్తాయి. మోకాటి లోతు నీళ్లలోనే నడవాల్సి ఉంటుంది.

పరిశ్రమల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించండి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నూతన పరిశ్రమల స్థాపనకు, యువతకు మెరుగైన ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. పీఎంఈజీపీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి లబ్ధిదారుల నుంచి అందిన 1,278 దరఖాస్తులకుగాను 541 యూనిట్లు మంజూరు చేయగా 516 గ్రౌండింగ్ అయ్యాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పెండింగ్ దరఖాస్తులను కూడా వేగంగా పరిష్కరించాలన్నారు. సింగిల్ డెస్క్ విధానంలో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 2,109 పరిశ్రమలకు గాను 2,077కు అనుమతులిచ్చామని, మరో 22 పరిశీలనలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, జిల్లా ఇన్‌చార్జి పరిశ్రమల శాఖ అధికారి మారుతీప్రసాద్, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు విజయభరత్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నడికుడి-శ్రీకాళహస్తి మధ్య రైల్వే లైనుకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. పీఎంజీ ప్రాజెక్టు పనుల పురోగతిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, కేంద్ర రైల్వేశాఖ ఉన్నతాధికారులు కలెక్టర్లు, జేసీలతో వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ హాజరయ్యారు. నడికుడి-శ్రీకాళహస్తి మధ్య రైల్వేలైన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పట్టా, డీకేటీ భూములకు సంబంధించిన అవార్డు పాసింగ్ పూర్తి చేశామని కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. సంబంధిత బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్‌కు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో భూసేకరణ డీటీ భాస్కర్ పాల్గొన్నారు.

పర్యాటక రంగాభివృద్ధికి చర్యలు తీసుకోండి



స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటక, ఆతిథ్య రంగాభివృద్ధికి వనరులు పుష్కలంగా ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌కు వచ్చిన ఆయన పర్యాటక, ఆతిథ్య రంగాల అభివృద్ధిపై సమీక్షించారు. టూరిజం కార్పొరేషన్ పనితీరుపై సమీక్షించారు. స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి పురోగతి సరిగా లేదని, దాని నిర్వహణ కోసం జేసీని అడ్మినిస్ట్రేటర్‌గా ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు. తిరుపతి, తిరుమలలో గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్, టీటీడీ సౌజన్యంతో అరకు కాఫీ యూనిట్లు చేపట్టనున్నట్లు తెలిపారు.

నేడు సుద్దాల అశోక్ 'శ్రమ కావ్యగానం'

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ 'శ్రమ కావ్య గానం' కార్యక్రమం శుక్రవారం తిరుపతిలో నిర్వహించనున్నారు. సమాజంలో శ్రమ ప్రాముఖ్యతను వివరిస్తూ అశోక్‌తేజ రాసిన పాటల పుస్తకంలోని పాటలను ఈ సందర్భంగా రాగయుక్తంగా పాడి వినిపించనున్నారు. స్థానిక యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సాయంత్రం 5గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుందని సీఐటీయూ నేత కందారపు మురళి తెలిపారు.


కిరణ్‌రాయల్ నుంచి ప్రాణహాని

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన లక్ష్మి

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జనసేన నేత కిరణ్ రాయల్‌పై ఇటీవల పలు ఆరోపణలు చేసిన లక్ష్మి గురువారం మరోసారి ఆయనపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు ఫిర్యాదు చేశారు. కిరణ్‌రాయల్ నుంచి తనకు ప్రాణహాని ఉందని, ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని వివరించారు. కిరణ్‌రాయల్‌పై తాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సెక్షన్లు నమోదు చేయలేదని, ఆయన్ను వెంటనే అరెస్టు చేసి, న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మరుగున పడుతున్న

మాతృభాషా ప్రాభవం!



- గత ప్రభుత్వ హయాంలో అమలు కాని హామీ
- కూటమి ప్రభుత్వమైనా చర్యలు చేపట్టేనా?

ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు సహా సూచిక బోర్డుల దాకా తెలుగుకు పెద్దగా దక్కని ప్రాధాన్యం

ఒత్తిడి పెట్టని తెలుగు భాషా సంఘాలు

నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



ఐఐతిరుపతి గోశాలలోని తెలుగు అకాడమీ తాత్కాలిక భవనం

తిరుపతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఇంటా బయటా చెవులకింపుగా, కంటికి నిండుగా వినిపించి కనిపించిన మాతృభాషా ప్రాభవం క్రమేపీ మరుగున పడిపోతోంది. 2012డిసెంబరు చివరి వారంలో ప్రపంచ తెలుగు మహాసభలను తిరుపతిలో నిర్వహించిన సమయంలో ఆ స్ఫూర్తితో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కొంత మేరకు తెలుగు భాషకు, తెలుగు సాంప్రదాయాలకు ప్రాధాన్యత లభించింది. అప్పట్లో చిత్తూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ సహా అధికారులు, ఉద్యోగులు ప్రతి సోమవారం తెల్ల పంచె, తెల్ల చొక్కా, కండువా ధరించి విధులకు హాజరయ్యే వారు. ఫైళ్ళు, ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో జరిపేందుకు ప్రయత్నాలు జరిగాయి. అప్పట్లో పాకాల కోర్టులో న్యాయమూర్తి తెలుగులో తీర్పు ప్రకటించి రాష్ట్రవ్యాప్తంగా అందరికీ ఆదర్శంగా నిలిచారు. అయితే క్రమేపీ ఆ స్ఫూర్తి లోపించింది. దానికనుగుణంగా తెలుగు భాష వినియోగం మరుగున పడగా ఇపుడు ఫైళ్ళు, రికార్డులన్నీ దాదాపు ఇంగ్లీషులోనే సాగుతున్నాయి. ఇ-ఫైళ్ళ పేరిట ఇపుడు ఉత్తరప్రత్యుత్తరాలలో ఇంగ్లీష్ వాడకం మరింతగా పెరిగిందనే చెప్పాలి. అధికారిక సమీక్షల్లో జిల్లా అభివృద్ధిని, వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పేరిట ఇంగ్లీషులోనే ప్రదర్శిస్తున్నారు. అధికార భాషా సంఘం నామమాత్రావశిష్టంగా మారింది. పర్యటనలూ లేవు, సమీక్షలు అంతకన్నా లేవు.



టీటీడీ జలప్రసాదంపైనా ఆంగ్లమే

తెలుగును తోసిరాజని ఆంగ్లానికి పట్టం

దేశంలోనే పేరుమోసిన పర్యాటక కేంద్రం, పుణ్యక్షేత్రమైన తిరుపతిలోనే తెలుగుకు ప్రాముఖ్యత దక్కకపోవడం భాషాభిమానులకు ఆవేదన కలిగిస్తోంది. పలు ప్రధాన కూడళ్ళలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డుల్లో ఇంగ్లీషు తప్ప తెలుగు కనిపించడం లేదు. దేశ విదేశాల నుంచీ వచ్చే యాత్రికుల కోసం వేర్వేరు భాషల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం అవసరమే. అదే సమయంలో వాటి సరసన మాతృభాషకూ చోటు దక్కకపోవడమే విమర్శలకు దారి తీస్తోంది. నగరంలో చాలావరకూ దుకాణాలు, వ్యాపార సముదాయాలకు ఇంగ్లీషులోనే నామ ఫలకాలు ఏర్పాటు చేసి వుండడం కనిపిస్తోంది.తమిళనాడు నుంచీ తిరుపతికి వచ్చే అక్కడి ప్రైవేటు,ప్రభుత్వ బస్సులపై తమిళ, ఇంగ్లీషు భాషల్లో బోర్డులు కనిపిస్తుండగా కర్ణాటక నుంచీ తిరుపతి వచ్చే అక్కడి ఆర్టీసీ బస్సులపై కన్నడ, ఇంగ్లీషు బాషల్లో బోర్డులు వుంటున్నాయి. ఈ రెండు రాష్ట్రాల బస్సుల గమ్యస్థానం తిరుపతి అయినప్పటికీ ఆ బస్సుల బోర్డుల్లో తెలుగుకు చోటు దక్కడం లేదు. ఈ రెండు రాష్ట్రాల బస్సులపై రవాణా సంస్థల పేర్లు గానీ, బస్సు సర్వీసుల పేర్లు గానీ తమిళ, కన్నడ భాషల్లోనే స్టిక్కరింగ్ చేయించడం కనిపిస్తోంది. కొన్ని బస్సులపై అదనంగా ఇంగ్లీషు కూడా వుంటోంది. అదే ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల విషయానికొస్తే గమ్యస్థానాల పేర్లు తమిళనాడుకు వెళ్ళేవాటిపై తెలుగు, తమిళంలోనూ, కర్ణాటక వెళ్ళేవాటిపై తెలుగు, కన్నడ భాషల్లోనూ రాయించి ఉదారత చాటుతున్నాయి. ఇది మంచి పద్ధతే కానీ అదే బస్సులపై రవాణా సంస్థ లేదా బస్సు సర్వీసుల పేర్ల విషయానికొస్తే ఎక్కువగా ఇంగ్లీషులోనే స్టిక్కరింగ్ చేయించడం కనిపిస్తోంది. మాతృభాషకు ప్రాధాన్యత ఇవ్వడంలో ఇరుగు పొరుగు రాష్ట్రాలను చూసి నేర్చుకోవాల్సిన అవసరం వుందని చెప్పాలి.



తిరుపతిలో షాపులపై తెలుగేదీ?





కర్ణాటక, తమిళనాడు బస్సులపై కనిపించని తెలుగు

తెలుగు అకాడమీ ఎక్కడ..?

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఓ వెలుగు వెలిగిన తెలుగు అకాడమీ చిరునామా ఇప్పుడు ఎక్కడ అనేలా పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర విభజన తర్వాత తిరుపతిలో తెలుగు అకాడమీ ఏర్పాటు చేస్తామనే గత వైసీపీ ప్రభుత్వ హామీ పూర్తిస్థాయిలో నెరవేరలేదు. తిరుపతిలోని ఎస్వీ గోశాలలో ఏర్పాటు చేసిన ఓ తాత్కాలిక భవనంలో తెలుగు అకాడమీ కార్యకలాపాలను నామమాత్రంగా కొంత సాగించింది. అయితే, పూర్తి స్థాయిలో సిబ్బంది కానీ, పుస్తక సామాగ్రి కానీ, ముద్రణ వ్యవహారాలు కానీ, పుస్తక క్రయ, విక్రయాలు కానీ తిరుపతి కేంద్రంగా పూర్తి స్థాయిలో సాగించలేదు. దీని ఫలితంగా వందలాది పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు వంటి ప్రతిష్టాత్మక సంస్థలు గల తిరుపతిలో అకాడమీ చిరునామా వెతుక్కోవలసిన పరిస్థితి ఏర్పడింది.తిరుపతిలోనే శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేస్తామని గతంలో తెలుగు అకాడమీ ఛైర్‌పర్సన్‌గా పనిచేసిన లక్ష్మీపార్వతి ప్రకటించినా ఆ దిశగా ఒక్క అడుగు ముందుకు పడలేదు సరికదా, విజయవాడలోనే తిష్ఠ వేసిన తెలుగు అకాడమీ కీలక అధికారులను కూడా తిరుపతికి తరలించలేకపోయారు. ముద్రణ వ్యవహారాలన్నీ విజయవాడ కేంద్రంగానే సాగాయి. క్రయ విక్రయాల సంగతి సరేసరి. నేరుగా తెలుగు అకాడమీకి వెళ్ళి ఒక్క పుస్తకం కూడ కొనలేని దౌర్భాగ్యం దాపురించింది. దీంతో సుదీర్ఘ చరిత్ర కల్గిన తెలుగు అకాడమీ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఇందుకు గత ప్రభుత్వ నిర్వాకమే కారణం. ఇప్పుడు కూటమి ప్రభుత్వమైనా దీనిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాల్సి వుంది.తెలుగు నుంచీ సంస్కృత అకాడమీని వేరు చేయడంతో పాటు తెలుగు అకాడమీకి కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది.రాజకీయ ప్రభావం కల్గిన వ్యక్తులకు కాకుండా, భాషా, సాహిత్య రంగాల్లో కృషి చేసిన వారిని గుర్తించి కార్యవర్గంలో చోటు కల్పిస్తే ప్రయోజనం చేకూరే ఆవకాశం ఉంటుంది.తిరుపతి కేంద్రంగానే శాశ్వత భవనం ఏర్పాటు చేసి పుస్తకాల ముద్రణ, అమ్మకం వంటి కార్యకలాపాలను సాగించాలని,కొత్త తరంలో మాతృభాష, సాహిత్యం పట్ల అభిరుచిని పెంపొందించాలని తెలుగు భాషాభిమానులు కోరుతున్నారు.

తెలుగు భాషా సంఘాల ఉదాసీనత

స్వచ్ఛందంగా తెలుగు వ్యాప్తికి, అభివృద్ధికి సేవలందించాల్సిన తెలుగు భాషా సంఘాల పాత్ర అంతకంతకూ తగ్గిపోతోంది.ఇరుగుపొరుగు రాష్ట్రాల్లో మాతృభాషకు అక్కడి జనం పట్టం కడుతున్న తీరును కళ్ళారా చూస్తూ కూడా తెలుగు భాషా సంఘాలు ఉదాసీనంగా వుండడం గమనార్హం.ఇప్పటికైనా ఆ సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తెలుగు భాషాభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరముంది.

పుత్తూరు వార్తలు

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం

ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న భాను

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం, బలగం అని ఎమ్మెల్యే భానుప్రకాష్ అన్నారు. గురువారం పుత్తూరు టీడీపీ శ్రేణుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పార్టీ శ్రేణుల సమష్టి కృషి, సహకారంతోనే అత్యధిక మెజార్టీ సాధించానన్నారు. కొత్త, పాత అనేది పక్కన పెట్టి అందరినీ కలుపుకు పోదామన్నారు. ఎళ్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. ఇక రాజకీయ కేసుల విషయంలో పరిష్కారం కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించానన్నారు. కొందరు పార్టీ శ్రేణులు వైసీపీ నాయకులకు వత్తాసు పలుకుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కొంత ఆలస్యమైనా తప్పకుండా అమలు చేస్తామన్నారు. తన తండ్రి ముద్దుకృష్ణమ పెద్ద సమస్యలను చిటికెలో పరిష్కరించేవారని, ఆయన వేగాన్ని త్వరలో అందుకుంటానన్నారు. గత ప్రభుత్వంలో పని చేసిన అధికారులు కొనసాగుతుండటంతో ఆ పార్టీకి వత్తాసు పలుకుతున్నారని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి చెప్పారు. సమస్యలుంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఆయన సూచనల మేరకు నడుచుకుందామని పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య చెప్పారు. డంపింగ్ యార్డు నిర్వహణ, ఆర్డీఎం గేటుకు ప్రత్యామ్నాయం, సబ్ ట్రెజరీ కార్యాలయంలో పింఛన్‌దారులు ఇబ్బందులు, 27 వార్డుల్లో కో ఆర్డినేషన్ కమిటీ వేయాలి... తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మాజీ ఎంపీపీ ఏలుమలై, కరుణాకర్, రమేష్, పార్టీ పట్టణ అధ్యక్షుడు జీవరత్నం నాయుడు, కార్యదర్శి ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఏషియన్ పెయింట్స్ విక్రయం

కంపెనీ ప్రతినిధి ఫిర్యాదుతో కేసు నమోదు ● నిందితుడి అరెస్ట్

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): పుత్తూరు కేంద్రంగా నకిలీ ఏషియన్ పెయింట్స్ విక్రయిస్తున్నట్లు కంపెనీ ప్రతినిధి తంబుస్వామి ఫిర్యాదుతో వెలుగుచూసింది. మదనకుమార్ కుమారుడు సుప్రీత్(29) నకిలీ ఏషియన్ పెయింట్ డబ్బాలను తెప్పించుకుని అందులో లోకల్ పెయింట్ నింపి ఒరిజినల్ ఏషియన్ పెయింట్‌గా నమ్మబలుకుతూ విక్రయిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీని కారణంగా తమ కంపెనీకి చెడ్డ పేరువస్తోందన్నారు. ఫిర్యాదు స్వీకరించిన సీఐ సురేంద్రనాయుడు పట్టణంలోని ఆర్కే ఫంక్షన్ హాలుకు సమీపంలో ఉన్న దుకాణాన్ని సీజ్ చేయడంతో పాటు నిందితుడు సుప్రీత్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఏషియన్ పెయింట్ లోగోతో కూడిన 20, 10 లీటర్ల 16 ఖాళీ డబ్బాలు, 20 లీటర్ల లోకల్ పెయింట్‌తో నిండి ఉన్న 13 డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి నష్టపోయినందునే వాటిని పూడ్చుకునే ప్రయత్నంలో ఈ నకిలీ ఏషియన్ పెయింట్ విక్రయానికి పాల్పడుతున్నట్లు నిందితుడు అంగీకరించాడు. మోసం, కాపీరైట్ చట్టం సెక్షన్ 63, 65 కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

కింది స్థాయి ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అఖిల భారత బీమాలో 3,4వ తరగతి ఉద్యోగుల నియామకం చేపట్టాలని పుత్తూరు డివిజన్ ఎల్ఐసీ ఉద్యోగుల యూనియన్ కార్యదర్శి లక్ష్మన్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎల్ఐసీ కార్యాయలంలోని ఉద్యోగులు దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా మధ్యాహ్నం 12.30నుంచి 1.30 గంటల వరకు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ప్రతి సంవత్సరం పదవీ విరమణ చేస్తున్నారని దానికి అనుగుణంగా నియమకాలు చేపట్టకపోవడం శోచనీయమని తెలిపారు. దస్తగిరి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు అందించకపోతే చర్యలు



చౌకదుకాణ డీలర్లకు సూచనలిస్తున్న తహసీల్దార్

పుత్తూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బియ్యంతో పాటు కంది పప్పు, నూనెను ప్రతి కార్డుదారునికీ అందించక పోతే కఠిన చర్యలు తీసుకుంటామని చౌకదుకాణ డీలర్లను పుత్తూరు తహసీల్దార్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. రెవెన్యూ కార్యాలయంలో గురువారం మండలంలోని చౌకదుకాణాదారులు, ఎండీయూ ఆపరేటర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్డుదారులు ఏ చౌకదుకాణం, ఎండీయూ వాహనం నుంచైనా నిత్యావసర వస్తువులను తీసుకునే వెసులుబాటు ఉన్నందున మున్సిపాలిటీ పరిధిలో ఇబ్బందులు తలెత్తకుండా పది శాతం సరుకులను అదనంగా అందిస్తామన్నారు. డీటీ అశోక్‌రెడ్డి, గోడౌన్ డీటీలు మునివేలు పిళ్లై, గురుస్వామి పాల్గొన్నారు.

నేరాల పట్ల యువత జాగ్రత్తగా ఉండాలి

పుత్తూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): యువత మీద చట్ట వ్యతిరేక కేసులు అధికంగా నమోదవుతున్నందున భవిష్యత్తును నాశనం చేసుకోకుండా జాగ్రత్త వహించాలని కేకేసీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ సూచించారు. పిళ్లారిపట్టు పాలిటెక్నిక్‌లో ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, ఆన్‌లైన్ మోసాలు, బాల్యనేరాలు- శిక్షలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఢిల్లీ సీఎంకు మహిళా మోర్చా శుభాకాంక్షలు

పుత్తూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ నాల్గో మహిళా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేఖా గుప్తాకు మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు నిషిధరాజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా సేవలందించిన రేఖను సీఎం పదవికి ఎంపిక చేయడం ప్రధాని మోదీ మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యానికి నిదర్శనమన్నారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకోవడం హర్షణీయమన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

వడమాలపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాస్, టాటా ట్రస్ట్ వైద్యశాల సహకారంతో మండలంలోని సీతారామాపురంలో వైద్య ఉచిత శిబిరం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్థులకు రక్తపోటు, మధుమేహం, హెపటైటిస్ సహా నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం క్యాన్సర్ పట్ల మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టాటా ట్రస్ట్ వైద్యశాల వైద్యులు వెంకయ్యబాబు, రెడ్డికుమారి, అమరావతి, రాస్ సిబ్బంది తేజ, మీనా, ద్రాక్షాయని పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



సుధాకర్(ఫైల్)

వడమాలపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి - చెన్నై రహదారిలో మండలంలోని కదిరిమంగళం రోడ్డు వద్ద రెండు బైక్‌లు ఢీకొనడంతో ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ ధర్మారెడ్డి చెప్పారు. మండలంలోని ఎస్వీపురానికి చెందిన టి.సుధాకర్ (52) మేస్త్రీ. గురువారం తిరుపతి నుంచి బైక్‌పై వడమాలపేటకు వస్తూ కదిరిమంగళం వద్ద రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి హర్ష అనే వ్యక్తి బైక్‌పై వేగంగా వస్తూ ఢీ కొన్నారు.ఈ ప్రమాదంలో సుధాకర్, హర్ష తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108కు సమాచారం అందించంగా అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పలించక సుధాకర్ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

రైతులకు అందుబాటులో గోదాములు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): దామానెల్లూరు ప్రాథమిక సహకార సంఘంలో ధాన్యం దాచుకొనేందుకు గోదాములు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ సీఈవో రామయ్య తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతిలో 'ధాన్యం దాచుకునేందుకు చోటేదీ' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో సీఈవో స్పందించారు. దామానెల్లూరు సహకార సంఘ పరిధిలో రైతులు పండించిన ఉత్పత్తులను దాచుకొనేందుకు నాలుగు గోదాములు ఉన్నాయన్నారు. ఇందులో దాదాపు 17 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసుకోవచ్చని పేర్కొన్నారు. దామానెల్లూరు, డేగవారి కండ్రిగ, సుద్దమడుగుతాగేలి, మంగానెల్లూరు, మంగళంపాడు, ఇలుపూరు, సుగ్గుపల్లి, వెలగలపొన్నూరు గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని రామయ్య కోరారు.

వృద్ధురాలి సరుడు అపహరణ

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి నుంచి మూడు సవర్ల సరుడును గుర్తుతెలియని యువకుడు అపహరించుకుని వెళ్లాడు. నాయుడుపేట పట్టణంలోని నివాసం ఉంటున్న జయమ్మ(80) గురువారం ఉదయం ఇంటి ముందు కూర్చొని ఉండగా గుర్తుతెలియని యువకుడు మోటారు సైకిల్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న మూడు సవర్ల సరుడును లాక్కోని పరారయ్యాడు. వెంటనే సమీపంలో ఉన్న మహిళలు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలికి చేరుకున్న అర్బన్ సీఐ బాబి వివరాలను నమోదు చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





డేగలపాలెం చెరువులో వ్యర్థాలు, పిచ్చిమొక్కలు - చెరువు గట్టున ఉన్న బోరు పాయింట్లు

సరఫరా చేస్తున్నది మంచి నీరేనా?

- డేగలపాలెం చెరువు నిండా వ్యర్థాలే
- బోరు పాయింట్లు కూడా కనిపించని వైనం
- అక్కడి నుంచే పట్టణానికి తాగునీరు
- నాణ్యతపై ప్రజల్లో అనుమానాలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంతో పాటు మండలంలోని కేసియన్ గుంట, మన్నెముత్తేరి పంచాయతీలకు తాగునీరందించే బోర్లు ఉన్న డేగలపాలెం చెరువు కాలుష్య కోరల్లో చిక్కుకుంది. చెరువులో 10 బోర్లు వేసి అక్కడ నుంచి పైపులైన్ల ద్వారా ఓవర్‌హెడ్ ట్యాంకులను నింపి పట్టణవాసులకు, కేసియన్ గుంట, మన్నెముత్తేరి పంచాయతీల ప్రజలకు తాగునీరందిస్తున్నారు. మొత్తం 10 బోరు పాయింట్లలో రెండు చెరువులో పూడిపోయాయి. మిగిలిన 8 పాయింట్లలో 6 బోర్ల నుంచి మున్సిపాలిటీ పరిధిలోని బాహూజీ కాలనీ, రాజీవ్ నగర్, కోళ్లమిట్ట, ఇసుక మిట్ట, స్వతంత్రపురం, సోనియాగాంధీ నగర్, కసారెడ్డి పాలెం, కేఆర్‌పాలెం ప్రాంతాలకు(మున్సిపాలిటీ పరిధిలో సగ భాగానికి) తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అదే విధంగా మండల పరిధిలోని కేసియన్ గుంట, మన్నెముత్తేరి పంచాయతీలకు రెండు బోర్ల నుంచి తాగు సరఫరా అవుతోంది. అయితే డేగలపాలెం చెరువు మొత్తం వ్యర్థాలతో పాటు పిచ్చి మొక్కలతో నిండిపోయింది. దీనికి పట్టణంలోని మురుగుతో పాటు నివాస గృహాల్లో వ్యర్థపు నీరంతా చెరువులోకి చేరుతోంది. అలాగే వర్షాకాలంలో కాలువలు, రోడ్లపై ప్రవహించే మురుగు నీరంతా చెరువులోకి చేరుతోంది. నీటి పథకాలను పర్యవేక్షణ చేసి ప్రజల ఆరోగ్యాన్ని రక్షించాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు స్పందించి డేగలపాలెం చెరువులో వ్యర్థాలు కలవకుండా చర్యలు తీసుకొని మంచినీరు సరఫరా అయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.25 కోట్లతో సిమెంటు రోడ్లు: విజయశ్రీ



సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

దొరవారిసత్రం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజవర్గంలో రూ.25 కోట్లతో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. దొరవారిసత్రం మండలం ఉచ్చూరు పంచాయతీ తిమ్మానాయుడు కండ్రిగలో రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో అన్ని గ్రామాలను వచ్చే ఐదేళ్లలో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యులు ఇట్టగుంట రత్నయ్య, నాయకులు ఇట్టగుంట మల్లేయ్య, నాగయ్యనాయుడు, సంచి విజయ్, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వయం ఉపాధి రుణాలకు ఇంటర్వ్యూలు

బాలాయపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం స్వయం ఉపాధి రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వినీల్ కుమార్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు తగిన ధృవీకరణ పత్రాలతో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు హాజరుకావాలన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫింగర్ ప్రింట్ స్కానర్



ఫింగర్ ప్రింట్ స్కానర్‌ను ప్రారంభిస్తున్న సీఐ మురళీకృష్ణ, పక్కన ఎస్ఐ బ్రహ్మనాయుడు తదితరులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నేరస్థులను సులువుగా గుర్తించేందుకు సూళ్లూరుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫింగర్ ప్రింట్ స్కానర్‌ను అందుబాటులోకి తెచ్చారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ మురళీకృష్ణ ఫింగర్ ప్రింట్ స్కానర్‌ను గురువారం ప్రారంభించారు. కంప్యూటర్ స్కానర్ సాయంతో అనుమానితుల ఫింగర్ ప్రింట్లు తీసుకోవడం ద్వారా నిందితులను సులువుగా గుర్తించవచ్చని సీఐ తెలిపారు. ఎస్ఐ బ్రహ్మనాయుడు సిబ్బంది ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

చిల్లకూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని నెలబల్లిరెట్టపల్లి హెచ్ఎం విజయలక్ష్మి అన్నారు. జాతీయస్థాయి జంప్ రోప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన 9వ తరగతి విద్యార్థి వెంకటేష్‌కు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ రాజనేని శ్రీనివాసులు నాయుడు సహకారంతో రూ.10వేలు ప్రోత్సాహక నగదు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని చదువులు, క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి ప్రజేంద్రరెడ్డి, పీడీ మస్తాన్‌బీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్పొరేట్ స్థాయి బోధన అందించాలి



యాప్ ద్వారా అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్, సీడీపీవో

కోట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్పొరేట్ స్థాయి విద్యా బోధనపై అందించాలని సీడీపీవో మునికుమారి కోరారు. కోటలోని బాలుర ఉన్నత పాఠశాలలో 3వ రోజు గురువారం అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల మానసిక అభివృద్ధిని గుర్తించాలన్నారు. అదే విధంగా విద్యాబోధనలో వస్తున్న మార్పులను ప్రయోగాత్మకంగా వివరించాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు కవిత, కృష్ణమ్మ, రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

పెన్నక్క చెరువుకు స్వర్ణముఖి జలాలు

కోట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలి స్వర్ణముఖినది నుంచి మిగులు జలాలను గురువారం పెన్నక్క చెరువుకు రైతులు మళ్లించుకున్నారు. పెన్నక్క చెరువు ఆయకట్టు కింద కింద కోట, చిల్లకూరు మండలాల పరిధిలో 8,500 ఎకరాల వరి పంటలకు రెండు తడులు సాగునీరు అవసరం ఉంది. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చొరవతో పెన్నక్క చెరువు ఆయకట్టు సంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వర్ణముఖినది నుంచి మామిడి కాలువ మీదుగా నీటిని మళ్లించారు.

రుణాల దరఖాస్తుల పరిశీలన

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ రుణాలకు కోసం అందిన దరఖాస్తులను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, బ్యాంకు అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దరఖాస్తులన్నింటినీ పరిశీలించి తుది జాబితాను ఆయా కార్పొరేషన్‌లకు పంపిడం జరుగుతుందన్నారు.

గురువుకు శ్రీసిటీ ఎండీ నివాళి



రాజయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

చిట్టమూరు, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం, మన్నెమాల గామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు తుమ్మల రాజయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన కుమారుడు జాన్సన్ నివాసం ఉంటున్న నాయుడుపేట మండలంలోని గొట్టిప్రోలు గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు మృతి చెందారని తెలుసుకున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి గురువారం గొట్టిప్రోలు గ్రామానికి చేరుకొని రాజయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన భార్య జయమణి, కుమారుడు జాన్సన్, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

డ్రోన్‌తో దోమల మందు పిచికారీ

నాయుడుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు డ్రోన్‌తో మందు పిచికారీ చేయడం ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట నారాయణ పాఠశాల ప్రాంతంలో గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ రఫీ, కమిషనర్ ఫజులుల్లాతో కలిసి డ్రోన్‌తో దోమల నివారణ మందు పిచికారీని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అవధానం సుధీర్, మొండెం బాబు, ముత్యాలయ్య, ధనంజయ, బాబు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రామానాయుడు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్ ప్రాజక్టులన్నీ పూర్తి చేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామా నాయుడు అన్నారు. గురువారం స్థానిక తెలుగుగంగ అతిథి గృహంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సాగునీటి రంగ సమస్యలపై ఈనెల 22నుంచి 24వ తేదీ వరకు కడపలో మహా సభలు నిర్వహిస్తామన్నారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాలకృష్ణయ్య, శివకుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ాక్టర్ గోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్షయవ్యాధి, వాటి లక్షణాల గురించి క్షుణ్ణంగా వివరించారు. రెండు వారాలకు పైగా దగ్గు, దగ్గినప్పుడు రక్తం పడడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వాస్పత్రికి వెళ్లి గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. టీబీని ఉన్నట్లు నిర్ధారణ అయితే ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.శేఖర్, టీబీ సూపర్‌వైజర్ బాల, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జనసేన నేతకు పలువురి శుభాకాంక్షలు



విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

పెళ్లకూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జనసేన మండల అధ్యక్షుడు మల్లాం విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను చెంబేడులో గురువారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు, కూటమి నేతలు మస్తాన్‌రెడ్డి, సందీప్, వేణు, బాబి, వంశీ, జనార్దన్ పుష్ప గుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

విద్యానగర్‌లో రక్తదాన శిబిరం



రక్తదాతలను అభినందిస్తున్న నేదురుమల్లి ఫౌండేషన్ చైర్మన్ రాంకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళి

కోట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్‌లో గల నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో గురువారం మాజీ సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డి 90వ జయంతి వేడుకలను ఘనంగా జరిగాయి. జనార్దనరెడ్డి చిత్రపటానికి నేదురుమల్లి ఫౌండేషన్ చైర్మన్ రాంకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళి, వైసీపీ నాయకులు యల్లశిరి గోపాల్‌రెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, దేవారెడ్డి షనీల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాంకుమార్‌రెడ్డితో పాటు ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్, ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం దానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, మేనేజర్ రామకృష్ణారెడ్డి, ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.

వాకాడులో జనార్దనరెడ్డి జయంతి

వాకాడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అశోక్‌పిల్లర్ వద్ద ఉన్న నేదురుమల్లి జనార్దనరెడ్డి విగ్రహానికి ఆయన తనయుడు రాంకుమార్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొడవలూరు భక్తవత్సలరెడ్డి, దువ్వూరు విజయశేఖర్‌రెడ్డి, దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు అంధుల జూడో జట్టు ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన అంధుల జూడో జట్టు

వెంకటగిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్ర జ్యోతి): ఉత్తరప్రదేశ్‌లో ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే అంధుల జాతీయస్థాయి జూడో పోటీలకు రాష్ట్ర జట్టును ఎంపిక చేసినట్లు ఏపీ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పచ్చూరి నరసయ్య తెలిపారు. గురువారం ఆయన వెంకటగిరిలో మీడియాతో మాట్లాడుతూ ఏపీ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంధుల జూడో జట్టు జాతీయ పోటీల్లో సత్తా చాటుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ముప్పాళ శేషగిరిరావు, ఇనగంటి వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో ఉన్న రైల్వే పోలీస్‌కు తీవ్ర అస్వస్థత

నాయుడుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉన్న రైల్వే పోలీస్ గణేషన్ తీవ్ర అస్వస్థతకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఈ ఘటన నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో గురువారం తెల్లవారుజామున జరిగింది. విధుల్లో ఉన్న గణేషన్ తీవ్ర అస్వస్థతకు గురై కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అదే సమయంలో ప్లాట్‌ఫాంపై వాకింగ్ చేస్తున్న టీడీపీ నాయకుడు పనబాక గంగబాబు గుర్తించి హుటాహుటిన స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. వెంటనే సూళ్లూరుపేట రైల్వే ఎస్ఐకు సమాచారం ఇవ్వడంతో ఆయన సిబ్బందితో నాయుడుపేటకు చేరుకుని గణేషన్‌ను చెన్నైకు తరలించారు.

జాతీయ ఉపకార వేతనానికి విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో హెచ్ఎం శేఖర్

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందించే జాతీయ ఉపకార వేతనానికి సూళ్లూరు పేటలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.తీర్థ, కె.స్మయిలీ, బి.సింధూ ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు కె.శేఖర్ తెలిపారు. వీరికి 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12,000 చొప్పున ఉపకార వేతనం అందుతుందని చెప్పారు.

వాకాడు మండల సమావేశం

వాకాడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్త్రీశక్తి భవనంలో గురువారం ఎంపీపీ కొడవలూరు అనసూయమ్మ ఆధ్వర్యంలో మండల సమావేశం జరిగింది. ఆయా శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి గురించి అధికారులు వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటరమణయ్య, ఎంపీడీవో అన్నపూర్ణారావు, ఐసీడీఎస్ సీడీపీవో మునికుమారి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు దువ్వూరు భాస్కర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శకుంతల, ఏపీవో విజయమ్మ, ఏవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అన్నపూర్ణారావు

దృష్టి లోపాలపై అప్రమత్తంగా ఉండాలి: ఆదిమూలం


కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దృష్టి లోపాలపై అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. గురువారం నారాయణవనం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా 138 మంది విద్యార్థులకు కంటి అద్దాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువులకు ఆటంకం కలిగించే అంధత్వాన్ని నివారించడానికి, కంటి సమస్యలను వెంటనే పరిష్కారించుకోవాలని తెలిపారు. కంటి చూపు బాగా ఉండడానికి విటమిన్ ఏ ఉన్న ఆహారాలు, ఆకుకూరలు తినాలని సూచించారు. జడ్పీటీసీ సభ్యుడు సుమన్ కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, సర్పంచు శారదమ్మ, ఉపసర్పంచ్ గణేశన్, టీడీపీ నాయకులు శివకుమార్, దొరైరాజు, డిప్యూటీ ఈవో ప్రభాకర్‌రాజు, జిల్లా ప్రోగ్రామింగ్ మేనేజర్ మధుబాబు, వైద్యాధికారి దర్శిత్ రాజ్, ఎంపీడీవో గుణశేఖర్, ప్రధానోపాధ్యాయురాలు శశికళ, ఈవో షణ్ముగం, పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కనీస వసతుల కరువు


మండుటెండలో మట్టి తవ్వుతున్న ఉపాధి కూలీలు

కేవీబీపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి కూలీలు కనీస వసతులు లేకుండా మండుటెండలో పని చేస్తున్నారు. గతంలో నీడ కోసం టెంట్‌ను ఏర్పాటు చేసేవారు. దీంతో పాటు ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచేవారు. తాగు నీరందించేందుకు మనిషిని కేటాయించేవారు. ప్రస్తుతం ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో పని ప్రదేశంలో నీడ, ప్రథమ చికిత్స మందులు, తాగునీరు అందించాల్సి ఉంది. దీనికితోడు కూలీలకు పనిముట్లు, పార, గడ్డపారవంటివి ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. గతంలో ప్రతి 15 రోజులకోసారి కూలీలను బ్యాంకు, పోస్టాఫీసుల్లో జమ చేసేవారు. నెలలు గడుస్తున్నా కూలీలు అందక ఇబ్బంది పడుతున్నారు. మస్టర్లు సరిగ్గా లేవని, ఆధార్ అనుసంధానం కాలేదని, ఆన్‌లైన్‌లో నమోదు కాలేదంటూ కుంటి సాకులు చెప్పి సంబంధిత ఉపాధి సిబ్బంది తప్పుకుంటున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రైల్వే డంపింగ్ యార్డు పొగతో ఇబ్బందులు



రేణిగుంట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రైల్వే డంపింగ్ యార్డు పొగతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. రేణిగుంట రైల్వే స్టేషన్‌లో సేకరించే చెత్తను స్థానిక ఎల్లమ్మ ఆలయ సమీపంలోని పారబోస్తుంటారు. అయితే ఈ చెత్తకు రాత్రి సమయంలో నిప్పు పెట్టడం కారణంగా అధిక శాతం పొగ జ్యోతి నగర్, అన్నానగర్, సీబీఐడీ, బాలాజీ కాలనీ, అలాగే పట్టణంలోకి వ్యాపిస్తోంది. చెత్త గాలికి ఎగిరి రోడ్డుపైకి చేరుతోంది. ఈ చెత్త వేసే ప్రదేశం పందులకు ఆవాస కేంద్రంగా మారింది. ఈ విషయంపై ఈవోపీఆర్డీ ప్రభురావును వివరణ కోరగా... రైల్వే అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

డొక్కా సీతమ్మ అన్నదానం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద జనసేన ఆధ్వర్యంలో గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో అన్నదానం చేపట్టారు. ప్రతి గురువారం పేదలకు అన్నదానం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తోట గణేష్, చంద్రశేఖర్, పేట చిరంజీవి, వెంకటరమణయాదవ్, వీర మహిళలు కవిత, బత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు ప్రింటర్ వితరణ



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పురుషుల జూనియర్ కళాశాలకు విశ్రాంత అధ్యాపకుడు చెంచుకృష్ణారెడ్డి రూ.30వేలు విలువైన ప్రింటర్‌ను వితరణ చేశారు. తాను పనిచేసిన కళాశాలకు ఏదో ఒక రూపంలో సాయం అందజేయాలనే ఉద్దేశంతో ప్రింటర్‌ను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈవోను కలిసిన ఉభయదారులు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం పెండ్లిమండపం ఉభయదారులు కైకాల, సెంగుందర్ కులస్థులు ఈవో బాపిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

రేపు కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

రేణిగుంట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈనెల 22న శనివారం ఉదయం 9.30గంటలకు బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఎంపీడీవో విష్ణు చిరంజీవి చెప్పారు. దరఖాస్తు ఫారం, ఒరిజినల్ రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు, బ్యాంకు పాసు పుస్తకం సహా మూడు జతల జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని పేర్కొన్నారు.

రూ.2 వేలతో రూ.40 లక్షల ప్రమాద బీమా

సత్యవేడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): భారతీయ స్టేట్ బ్యాంక్ ఇటీవల ప్రవేశ పెట్టిన వ్యక్తిగత ప్రమాద బీమా పథకంలో రూ.2000 ప్రీమియంతో రూ. 40 లక్షల ప్రమాద బీమా పొందవచ్చని స్థానిక ఎస్బీఐ మేనేజర్ వి.సురేష్ పేర్కొన్నారు. ప్రీమియం రూ.100కు రూ.2 లక్షలు మొదలుకుని, గరిష్ఠంగా రూ. 2 వేలకు రూ. 40 లక్షల ప్రమాద బీమా పొందవచ్చన్నారు. రోడ్డు ప్రమాదాలు, విద్యుదాఘాతం, వరదలు, భూకంపం, తేలుకాటు మరణాలకు బీమా వర్తిస్తుందని తెలిపారు. 18 నుంచి 70 ఏళ్ల వారు అర్హులన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎస్సీవీనాయుడు, మునిరామయ్య

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్య అన్నారు. గురువారం పట్టణంలోని దక్షిణ కైలాస్ నగర్‌లోని టెన్నిస్ క్రీడా మైదానంలో జరుగుతున్న అయిస్టా టెన్నిస్ పోటీలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక రుగ్మతలకు దూరంగా ఉంచడమే కాకుండా దేహదారుఢ్యానికి దోహదపడుతుతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ చంద్రశేఖర్, మోహన్‌రావు, రామ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మూడు సంవత్సరాలుగా...
పారిశుధ్య కార్మికులకు అందని జీతాలు

కేవీబీపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరు పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు రెండేళ్లుగా జీతాలు అందడం లేదు. చివరగా 2022 సంవత్సరంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం వీరికి జీతాలు అందజేసింది. అప్పటి నుంచి ఇప్పటికీ వీరికి జీతాలు అందించలేదు. వీరు ఈ పనులనే నమ్ముకుని జీవిస్తున్నారు. తమకు జీతాలు అందించాలని గురువారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు.

నెలరాజుపై గరళకంఠుడి విహారం

చప్పరంపై స్వామివారిని అనుసరించిన మరగదాంబిక



యాగశాల మండపంలో స్వామివారికి హారతి - తిరువీధి ఉత్సవానికి చంద్రప్రభ వాహనంపై బయలుదేరిన స్వామివారు

నాగలాపురం, ఫిబ్రవరి 20, (ఆంధ్రజ్యోతి): సురుటుపల్లె సర్వమంగళాదేవి సమేత పల్లికొండేశ్వర స్వామి ఆలయ మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరళకంఠుడు నెలరాజుని అధిష్టించి తిరువీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. ఆయన్ను అమ్మవారు చప్పరంపై అధిరోహించి అనుసరించారు. బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన గురువారం పట్టు వస్త్రాలు, స్వర్ణాభరణాలు, పుష్పాలంకరణాలతో ముస్తాబైన స్వామివారు చంద్రప్రభ వాహనంపై ఆశీనులవగా అమ్మవారు చప్పరంపై అధిష్టించారు. వేదమంత్రోచ్చారణలు, బాణసంచా పేలుళ్ల మధ్య స్వామిఅమ్మవార్ల వాహన సేవ వైభోపేతంగా జరిగింది. ఓం నమశ్శివాయా అంటూ భక్తులు స్వామివారి వాహన సేవలో పాల్గొన్నారు. ఉదయం ఆలయశుద్ధి అనంతరం మూల మూర్తులైన వాల్మీకేశ్వరస్వామి, మరగదాంబిక అమ్మవార్లకు ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుక్కల్ మూడు కాలాలు, పంచమ తీర్థాలతో అభిషేకించారు. అనంతరం దీప, ధూప నైవేద్యాలు సమర్పించి మహా హారతులు చేపట్టారు. తదనంతరం ఆలయ ఆవరణలోని యాగశాల మండపంలో యాగశాల పూజలను నిర్వహించారు. రాత్రి ఆలయ ఆవరణలో కోలాటాలు, అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. ఈ పూజలకు ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ తిరునీలకంఠన్, పరమశివం(బాషా) కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో సిబ్బంది దండపాణి, పరంధామరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి


పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటేశ్వరరాజు తదితరులు

పిచ్చాటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టు ఆధునికీకరణ, పర్యాటక అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వరరాజు ఆదేశించారు. రూ.35 కోట్ల జైకా నిధులతో నాలుగేళ్ల క్రితం ప్రారంభమైన పనులు నత్తనడకన సాగు తుండడంపై కలెక్టర్ దృష్టికి ఎమ్మెల్యే ఆదిమూలం తీసుకెళ్లిన విషయం విదితమే. దీంతో పాటు తుడా నిధులు రూ.1.85 కోట్లతో జరుగుతున్న టూరిజం పనులు నిలిచి పోయినట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పిచ్చాటూరు నీటి పారుదలశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటేశ్వరరాజు గురువారం ప్రాజెక్టు వద్దకు చేరుకుని పనుల జాప్యంపై ఆరా తీశారు. పనులు వేగవంతానికి తీసుకోవలసిన చర్యలపై ఇరిగేషన్ ఈఈ మదనగోపాల్, డీఈ రామచంద్రమూర్తి, ఏఈలు లోకేశ్వర్‌రెడ్డి, మురళీమోహన్‌తో సమీక్షించారు. నివేదికను కలెక్టర్‌కు, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులకు పంపించనున్నట్టు ఎస్ఈ తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి


విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న సుందర రామిరెడ్డి తదితరులు

సత్యవేడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా కృషి చేస్తే విజయాలు సొంతమవుతాయని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. గురువారం పట్టణంలోని వీఎంకే కల్యాణ మండపంలో బాబు జూనియర్ కళాశాల 15వ వార్షికోత్సవం కళాశాల కరస్పాండెంట్ పరంధాం ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి జీవితంలో కళాశాల విద్య కీలకమన్నారు. తాత్కాలిక ఆనందాలకు లోను కాకుండా క్రమశిక్షణతో చదువుకుంటే భవిష్యత్తు అందంగా ఉంటుందన్నారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సుందరరామి రెడ్డి, ఎంఈవోలు రవి, ఉష, అధ్యాపకులు భాస్కర్, పళణి, ప్రసన్న, కుమార్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది కిలోల గంజాయి స్వాధీనం


నిందుతుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

సత్యవేడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తిని సత్యవేడు పోలీసులు అదుపులోకి తీసుకుని అతడి నుంచి ఎనిమిది కిలోల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్ఐ రామస్వామి వివరాలు తెలిపారు. గురువారం ఉదయం రాష్ట్ర సరిహద్దులోని మాదరపాకం చెక్ పోస్ట్‌వద్ద ఎస్ఐ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బ్యాగ్‌తో అనుమానస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులో తీసుకుని విచారించామన్నారు. అతని బ్యాగ్‌లో రూ.80 వేల విలువైన ఎనిమిది కిలోల గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. కాగా పట్టుబడ్డ వ్యక్తి తమిళనాడు రాష్ట్రం మధురైకు చెందిన బాలమురుగన్ (43)గా గుర్తించామన్నారు. ఇతను విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలు చేసుకుని సత్యవేడు మీదుగా చెన్నైకు తీసుకెళ్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. కాగా పట్టుబడ్డ బాలమురుగన్‌పై విశాఖపట్నంలో కేసు కూడా నమోదైనట్లు తెలిసిందన్నారు.

సీఎం పర్యటన బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

రేణిగుంట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఈనెల 23న సీఎం పర్యటనపై బందోబస్తు ఏర్పాట్లను అడిషనల్ ఎస్పీ రవి మనోహాచారి పరిశీలించారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ తనయుడు వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు సీఎం చంద్రబాబు రానుండడంతో ముందస్తుగా కల్యాణ మండపాన్ని డీఎస్పీ శ్రీనివాసరావు సహా సిబ్బందితో కలిసి పరిశీలించారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన శిక్ష


సమావేశంలో మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలకు పాల్పడిన వారికి శిక్ష తప్పదని ప్రగతి సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ రాజారెడ్డి అన్నారు. గురువారం తొట్టంబేడు మండలం పూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ... రానున్న శివరాత్రికి ముక్కంటీశుడి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని చాలామంది వివాహాలు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే చైల్డ్ లైన్ టోల్‌ఫ్రీ నెం.1098కి సమాచారం ఇవ్వాలన్నారు. బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శైలజ, ఉపాధ్యాయులు, మహిళా పోలీసు రేణుగ, ప్రగతి సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో పీ4 సర్వే

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ పంచాయతీలో గురువారం పీ4 సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రసాద్ మాట్లాడుతూ పీ4 సర్వే ఏ పథకానికి సంబంధించింది కాదన్నారు. ప్రభుత్వం సమర్థంగా ప్రణాళికలు రూపొందించేందుకు ఈ డేటా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ చిరంజీవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మిక శాఖ మంత్రికి ముక్కంటి ప్రసాదాలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రికి ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను డైరెక్టర్ గుడ్లూరు మయూర్ తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. మంత్రిని ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మయూర్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఎంజీఎం ఆస్పత్రి పరిసరాల్లో సుమారు 30 పరిశ్రమలు ఉన్నాయని అందులో 20 వేలమంది వరకు కార్మికులు పని చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఈఎస్ఐ సేవలు వారికి ఎంతో అవసరమన్నారు. తమ ఆస్పత్రికి అనుమతి ఇవ్వాలని కోరారు.

ట్రాక్టర్ కదలడంతో బాలుడికి తీవ్ర గాయాలు

రేణిగుంట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ కదలడంతో బాలుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన గురువారం రాత్రి ఆర్‌సీఎం చర్చి ముందున్న సిమెంటు ఇటుక బట్టీలో జరిగింది. స్థానికుల కథనం మేరకు... బిహార్‌కు చెందిన కొందరు బట్టీలో పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. వారిలో అఖిల్(7) లోడ్ చేసిన ట్రాక్టర్ కింద ఆడుకుంటుండగా ఈ విషయాన్ని గుమనించకుండా డ్రైవర్ వాహనాన్ని తోలడంతో కింద ఉన్న బాలుడు మెడ, కాళ్ల వద్ద తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం బాలుడిని రుయా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై అర్బన్ పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

చిన్నారులకు అర్థమయ్యేలా బోధించాలి


బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అంగనవాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు అర్థమయ్యేలా బోధించాలని ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన పరిశీలించారు. 3నుంచి 8సంవత్సరాల పిల్లల మెదడు అభివృద్ధి గురించి వివరించారు. హెచ్‌ఎం రమణయ్య, సూపర్‌వైజర్ యమున తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు నిస్వార్థంగా సేవలందించాలి


మాట్లాడుతున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో వచ్చే భక్తులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ నిస్వార్థంగా సేవలదించాలని డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. పట్టణంలోని సరస్వతిబాయి పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ గైడ్ కెప్టెన్ల శిక్షణ కార్యక్రమానికి గురువారం ఆయన హాజరయ్యారు. సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో లీడర్లు ట్రైనర్ శకుంతలమ్మ, ధనలక్ష్మి, కార్యలయ కమిషనర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'అ' అక్షరాకృతిలో విద్యార్థులు



బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో అ అక్షర ఆకృతిలో తెలుగు భాషాభిమానాన్ని విద్యార్థులు గురువారం చాటుకున్నారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మేధో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కలశ ప్రతిష్ఠ అనంతరం వినాయక, కలశ పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం స్వామివారిని పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకించారు. సుగంధభరిత పూలు, స్వర్ణాభరణాలతో అలంకరించి పర్వత, చక్ర, కుంభ, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.